


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 112 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 4 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 112 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 4 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- సీఎం మార్పుపై ఇప్పటివరకూ చర్చించలేదని స్పష్టీకరణ
- పార్టీలో విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్షాల కుట్ర అంటూ ఆరోపణ
- కాంగ్రెస్‌లో అసమ్మతి లేదు.. అంతా ఐక్యంగా ఉన్నామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు, నాయకత్వలేమిపై వస్తున్న వార్తలకు డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ (డీకే) తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు.

- మిగతా2లో



# హోలీ ఆనందాల హోలీ

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు

2 లో

- డీజే మోతలు,రెయిన్ భగత డ్యాన్సతో వీధులన్నీ రంగుల మయం
- తీన్ మార్ స్టెప్పులతో యువతలో ఫుల్ జోష్

హైదరాబాద్ పెన్ పవర్ : రాష్ట్రవ్యాప్తంగా హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎక్కడ చూసిన రంగులు చల్లుకుంటూ చిన్నా, పెద్దా సందడి చేశారు. చిన్నారులు ఫుల్ జోష్ కేరింతలు కొట్టారు. డీజే మోతలు, రెయిన్స్ డ్యాన్స్, తీన్మార్, ధూమ్ ధామ్ స్టెప్పులతో వీధులన్నీ రంగులమయ్యాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తార్నాకలోని తన నివాసంలో హోలీ పండుగను ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.

50కి పైగా స్పెషల్ ఈవెంట్లు హైదరాబాద్ మహానగరంలో ఈసారి రెండు రోజుల పాటు హోలీ వేడుకలు నిర్వహించనున్నా రు. మొత్తం మీద 50కుపైగా ఈవెంట్లు సిటీలోజరగనున్నాయి. అందుకు అనుగుణంగా నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్నివాల్ డ్యాన్సర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా, పుణె, పంజాబ్ నుంచి ప్రత్యేకంగా ధోల్ కళాకారులను ఆహ్వానించారు. మడ్పిట్లు, రెయిన్‌డ్యాన్స్ జోన్లు,



## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు.. చేతికి స్వల్ప గాయం!

- నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద ఆందోళన చేపట్టిన కవిత
- హైడ్రా వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరిక
- కవితతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మిగతా2లో



## జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప ముఖ్యమంత్రి
- ఈ నెల 5న తన కుమారుడి వివాహానికి రావాలంటూ ఆహ్వానం
- శుభాకాంక్షలు తెలిపిన జగన్

హైదరాబాద్ పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు

- మిగతా2లో

## 90 డేస్ యాక్షన్ ప్లాన్.. కలెక్టర్లకు సీఎం కీలక ఆదేశాలు

హైదరాబాద్ పెన్ పవర్:తొంబై రోజుల యాక్షన్ ప్లాన్ లో అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మార్చి 3న అన్ని జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు సీఎం. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ సభల్లో సంక్షేమ పథకాల వారీగా ప్రభుత్వం చేకూరుస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు

- మిగతా2లో





## తెలంగాణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్




- భారతీయ సంప్రదాయంలో రంగుల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్న కేసీఆర్
- ఈ పండుగ జీవితంలో నూతనత్వానికి సంకేతమని ట్వీట్
- ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష

- మిగతా2లో

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది...

ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను




- ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ వాయుసేన, నావికాదళం, రక్షణ వ్యవస్థలు ధ్వంసమైనట్లు వెల్లడి
- ఆ దేశ నాయకత్వం కూడా తుడిచిపెట్టుకుపోయిందన్న అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో

## నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు

- కార్పొరేట్లకే బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందన్న మహేశ్ గౌడ్
- తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని విమర్శ
- లొంగిపోయిన మావోలు కాంగ్రెస్ లోకి వస్తే ఆహ్వానిస్తామని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమర్థులైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారని, ఒకటి లేదా రెండు స్థానాల కేటాయింపుపై రేపు స్పష్టత వస్తుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కేవలం కార్పొరేట్ శక్తులకే పెద్దల సభలో అవకాశం ఇచ్చిందని, తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని ఆయన విమర్శించారు. అలాగే, మార్చి నెలలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని వెల్లడించారు.

మిగతా 2లో







## తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం ప్రకటించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒక పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. మంగళవారం బహిరంగ లేఖ ద్వారా పేర్కొంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని తెలిపారు.

మిగతా 2లో



## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు


- స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన లోకేశ్
- శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక ఆశీస్సులు పొందిన మంత్రి దంపతులు
- ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అధికారులు, స్థానిక నాయకులు

మిగతా 2లో

## పశ్చిమాసియా రణరంగం

అమెరికా ఎంబసీలను టార్గెట్ చేసిన ఇరాన్

- సౌదీలోని అమెరికా దౌత్య కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ల దాడి
- బహ్రెయిన్, ఒమన్‌లలోని అమెరికా స్థావరాలపైనా విరుచుకుపడ్డ ఇరాన్
- టెహ్రాన్, బీరుట్ లలో కొనసాగుతున్న ఇజ్రాయెల్ విధ్వంసకాండ
- అంతర్జాతీయంగా ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలు




పెన్ పవర్ డెస్క్:మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కూటమి దాడులతో ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇరాన్ తీవ్రస్థాయిలో దాడులు చేస్తోంది. ముఖ్యంగా అమెరికా దౌత్య కార్యాలయాలు, సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని ఇరాన్

మిగతా 2లో

## ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

- భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడి
- గల్ఫ్ దేశాల మీద జరుగుతున్న దాడులపై ప్రధాని ఆందోళన
- చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్న విదేశాంగ శాఖ

మిగతా 2లో






## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

- దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో భూకంపం
- రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో కంపించిన భూమి
- గెరాష్‌కు 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం

మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు: ట్రంప్ సుదీర్ఘ దాడుల వ్యూహం ఏమిటి?

మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు రేగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' తర్వాత పరిస్థితులు వేగంగా మారాయి. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ల దాడి జరిగినట్టు వచ్చిన సమాచారం నేపథ్యంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు యుద్ధం త్వరలో ముగిసే సూచనలు కనిపించడం లేదనే సంకేతాలు ఇస్తున్నాయి. "మా ప్రతిస్పందన ఏమిటో త్వరలో తెలుస్తుంది" అన్న ఆయన వ్యాఖ్యలు సుదీర్ఘ సైనిక వ్యూహానికి నాంది పలికినట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ పరిణామాలకు ఆయువులా నిలిచింది ఇరాన్ అణు కార్యక్రమమే. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పూర్తిగా అంగీకరించబోమని అమెరికా స్పష్టం చేస్తుండగా దీర్ఘ పరిధి క్షిపణులు అమెరికా స్థావరాలు.. మిత్రదేశాలకు ముప్పుగా మారుతున్నాయనే ఆందోళన వాషింగ్టన్‌లో పెరుగుతోంది. ఇరాన్ సైనిక వ్యవస్థను బలహీనపరచడం.. ముఖ్యంగా దాని మిసైల్ సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యమని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇరాన్ వైపు చూస్తే సుప్రీం లీడర్ ఖమేనీ మరణించినట్టు వచ్చిన వార్తలు దేశంలో రాజకీయ అనిశ్చితిని మరింత పెంచాయి. నాయకత్వ శూన్యత మధ్య ఇరాన్ సైన్యం, ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) ప్రతిదాడులతో తన స్థైర్యాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. యూఏఈ, ఖతార్ ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై జరిగిన దాడుల్లో అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం రావడంతో అమెరికా మరింత కఠిన వైఖరిని అవలంబించే అవకాశం ఉంది. ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య పరిమితం కాదు. గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. చమురు ఉత్పత్తి, సరఫరా మార్గాలు, హోర్ముజ్ జలసంధి భద్రత వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. చమురు ధరలు పెరగడం వల్ల గ్లోబల్ ఇన్ఫ్లేషన్ మళ్లీ ఎగసిపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే మార్కెట్లు అస్థిరంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ రాజకీయ రంగంలోనూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. యురోపియన్ యూనియన్ శాంతి చర్చలకు మద్దతు తెలుపుతూ అణు విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు రష్యా, చైనా వెంటనే దాడులు ఆపాలని పిలుపునిచ్చాయి. ఒమాన్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరగబోయే చర్చలు కీలక మలుపు తిప్పే అవకాశమున్నప్పటికీ యుద్ధభూమిలో జరుగుతున్న పరిణామాలు దౌత్యపరమైన ప్రయత్నాలను బలహీనపరుస్తున్నాయి.

ట్రంప్ మరో నాలుగు నుంచి ఐదు వారాలు దాడులు కొనసాగవచ్చని చేసిన ప్రకటన యుద్ధ వ్యూహం ముందుగానే సిద్ధంగా ఉన్నట్టు సూచిస్తోంది. ఇది కేవలం ప్రతీకార దాడి కాద.. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని వ్యవస్థాత్మకంగా కుదించే లక్ష్యంతో రూపొందించిన సుదీర్ఘ ఆపరేషన్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీర్ఘకాల యుద్ధం అమెరికా లోపల కూడా రాజకీయ ప్రభావాలను చూపవచ్చు. సైనిక నష్టం, ఆర్థిక భారం, అంతర్జాతీయ ఒత్తిళ్లు.. ఇవి కలిసి వాషింగ్టన్ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశముంది. మొత్తానికి ఈ సంక్షోభం మధ్యప్రాచ్య భద్రతా సమీకరణాలను పూర్తిగా మార్చే దిశగా సాగుతోంది. అణు కార్యక్రమం, ప్రాంతీయ ఆధిపత్యం, మిత్రదేశాల భద్రత.. ఇవన్నీ ఈ మూడు అంశాల చుట్టూ తిరుగుతున్న ఈ యుద్ధం త్వరగా ముగిసే సూచనలు లేవు. దౌత్య మార్గాలు తెరిచి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో సైనిక చర్యలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వచ్చే కొన్ని వారాలు గ్లోబల్ రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థలకు కీలక పరీక్ష కాలంగా మారనున్నాయి.

## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతుం డగా, మరోవైపు ఇరాన్‌లో భూకంపం సంభవించింది. దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం గురించి వివరాలు తెలియాల్సి ఉంది. గెరాష్‌కు ఉత్తర వాయువ్య దిశలో 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రత నమోదు కావడంతో ఈ భూకంపాన్ని తేలికపాటి నుంచి మధ్యస్థాయి భూకంపంగా తెలిపారు. భూకంపం వచ్చిన ప్రాంతం ఎక్కువగా గ్రామీణ ప్రాంతం. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగు పెట్టారు. ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ కాలేదు.

## జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- మొదటి పేజి తరువాయి

భట్టివిక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు విక్రమాదిత్య వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వధూవరులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. కాగా, తన కుమారుడి వివాహానికి రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తూ భట్టివిక్రమార్క ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి బ్రహ్మణి పాల్గొన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న లోకేశ్, బ్రహ్మణి దంపతులకు దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన స్వామివారి కల్యాణాన్ని వారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. కార్యక్రమం ముగిశాక వేద పండితులు మంత్రి దంపతులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ పవిత్రమైన కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంగళగిరి క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

# తెలంగాణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

హోలీ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంప్రదాయంలో రంగుల పండుగకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఇది మనుషుల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందించే అద్భుతమైన వేదిక అని ఆయన కొనియాడారు. ఆకులు రాలే శిశిరం ముగిసి, ప్రకృతి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ వచ్చే ఈ పండుగ, సామాజిక జీవితంలో నూతనత్వానికి సంకేతమని కేసీఆర్ అభివర్ణించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొంత నిరాశలో ఉన్న తెలంగాణ ప్రజల్లో ఈ హోలీ పండుగ సరికొత్త ఆశలను, విశ్వాసాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సహోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని, ఈ రంగుల వేడుక అందరి నడుమ ఆప్యాయతలను మరింతగా విరజిమ్మాలని కేసీఆర్ తన సందేశంలో పేర్కొన్నారు. ప్రకృతిలో వచ్చే మార్పుల వలెనే ప్రజల జీవితాల్లో కూడా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన కోరుకున్నారు.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

# కవిత అరెస్టు..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అంటూ ఆమె నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో ఎక్కిస్తుండగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ

నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా, రంగనాథ్ రావాలని వారు డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

# హోలీ ఆనందాల హేలీ

- మొదటి పేజి తరువాయి

సెలబ్రిటీ డీజేలు, లైవ్ బ్యాండ్ ప్రదర్శనలు సందడిని రెట్టింపు చేస్తున్నాయి. నెక్లెస్ రోడ్ నుంచి హైటెక్ సిటీ, గచ్చిబౌలి వరకు నగరంలోని అనేక ప్రదేశాల్లో ఈ వేడుకలు జర గనున్నాయి.

ఎస్పీ తీన్ మార్ స్టెప్పులు

నిర్మల్: నిర్మల్ ఎస్పీ క్యాంపు ఆఫీస్ లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జ్ఞ్నసకి షర్మిల బ్యాండ్ వాయించి డ్యాన్స్ చేసి సంబరాలు జరిపారు. తీన్ మార్ స్టెప్పులతో అలరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఉపేందర్ రెడ్డి, భైంసా

ఏఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏఎస్పీ సాయి. కిరణ్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం ప్రకటించాలి

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదంటూ హామీల అమలుకు తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఖజానా ఖాళీ అన్న ముఖ్యమంత్రి ఇటీవల ఓ సభలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వారి వ్యాఖ్యలు చూస్తే రాష్ట్ర ఖజానా నిల్?, పార్టీ నాయకుల జేబులు ఫుల్‌గా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడి హామీల అమలు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా-రాహుల్ గాంధీ కుటుంబానికి, పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం చూస్తుంటే పార్టీ నేతలు దోచుకున్నట్లు ప్రజలకు అర్థమైందన్నారు.

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకారం..**

కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి తెలంగాణ అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తున్నారు.. గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36 వేల కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50 వేల కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40 వేల కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50 వేల కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ ఇచ్చామన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40 వేల కోట్లకు పైగా నిధులు, రూ.12 వేల కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14 వేల కోట్లకు పైగా పీఎం కిసాన్ నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80 వేల కోట్లకు పైగా నిధులు, విద్య, క్రీడలకు రూ.21 వేల కోట్లకు పైగా నిధులు, దాదాపు రూ.9 వేల కోట్ల ఆరోగ్య సంరక్షణకు మంజూరు చేసినట్లు తెలిపారు.

**రైతులకు మద్దతు ధర కోసం రూ. 60వేల కోట్లు చెల్లింపు..**

రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించి మరో రూ.60 వేల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించినట్లు పేర్కొన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా దాదాపు రూ. 10 లక్షల కోట్ల రుణాలు కూడా తెలంగాణ రాష్ట్రానికి అందించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రహిత రుణాల మీద ఆధారపడటం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలాంటి దుస్థితిలో ఉందో తెలుస్తోందన్నారు. గతంలో తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించడానికి రుణాలు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి రుణాలు, రైతు భరోసా నిధులకు రుణాలు, సంక్షేమ పథకాల అమలుకు రుణాలు ఇలా చెప్పుకుంటూ పోతే రుణాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేని పరిస్థితి నేడు తెలంగాణలో ఉందన్నారు. 2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోందన్నారు. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున పెరుగుతున్న రాష్ట్ర తలసరి అప్పు కూడా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన ఒక పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పశ్చిమాసియా రణరంగం

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడుతోంది. యుద్ధం నాలుగో రోజుకు చేరుకోగా.. ఇరాన్ తన వ్యూహాన్ని మార్చింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో ఉన్న అమెరికన్ ఎంబసీపై రెండు డ్రోన్లతో దాడి చేసింది. ఈ ఘటనలో ఎంబసీ ఆవరణలో మంటలు చెలరేగగా, భవనానికి స్వల్ప నష్టం వాటిల్లింది. దౌత్య కార్యాలయాలపైనే నేరుగా దాడులు జరగడం యుద్ధ తీవ్రతను తెలియజేస్తోంది. మరోవైపు ఒమన్‌లోని దుక్మ్ పోర్ట్‌పై కూడా డ్రోన్ దాడి జరగడంతో ఇంధన ట్యాంక్ దెబ్బతింది. అలాగే బహ్రెయిన్‌లోని అమెరికన్ ఎయిర్ బేస్‌లో ఉన్న ఓ కమాండ్ భవనాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని ఇరాన్ మీడియా ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో నౌకలను మంటల్లో కలిపేస్తామంటూ ఇరాన్ అధికారులు హెచ్చరించారు. మరోవైపు ఇజ్రాయెల్ తన దాడులను ఏమాత్రం తగ్గించడం లేదు. ఇజ్రాయెల్ వైమానిక దళం మంగళవారం కూడా టెహ్రాన్‌లోని సైనిక లక్ష్యాలపై విరుచుకుపడింది. టెహ్రాన్ తూర్పున ఉన్న పార్డిస్ ప్రాంతంలో భారీ పేలుళ్లు సంభవించగా, నగరం మొత్తం పొగతో నిండిపోయింది. ఇజ్రాయెల్ అటు లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివార్లలోనూ భవనాలను నేలమట్టం చేస్తోంది. దీనికి దీటుగా హిజ్బుల్లా కూడా గోలాన్ హైట్స్, మెరాన్, రమత్ డేవిడ్ వైమానిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ యుద్ధం కారణంగా సామాన్యులు బలవుతున్నారు. ఇరాన్‌లో ఇప్పటివరకు 787 మంది మరణించగా, అందులో 176 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. అటు అమెరికా వైపు ఆరుగురు సైనికులు మరణించారు.

అమెరికా సైనికుల మరణాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ కూడా ధృవీకరించింది. ఖతార్, సౌదీలో చమురు

ఉత్పత్తికి అంతరాయం కలగడంతో అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధరలు భగ్గుమంటున్నాయి. సోమవారం 50 శాతం పెరిగిన ధరలు, మంగళవారం మరో 33 శాతం పెరిగి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం చేస్తామని అమెరికా మంత్రి మార్కో రుబియో హెచ్చరించగా, టెహ్రాన్‌పై పూర్తి శక్తితో విరుచుకుపడతామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి స్పష్టం చేశారు.

## 90 డేస్ యాక్షన్ ప్లాన్.. కలెక్టర్లకు సీఎం కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

సీఎం. ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేసేందుకు సమీపంలోని మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేయాలని కలెక్టర్లకు సూచించారు సీఎం రేవంత్. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపులు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 99 డేస్ ప్రోగ్రాంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలన్నారు సీఎం.

## నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు

- మొదటి పేజి తరువాయి

మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ... దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పనిచేస్తున్న వారి పట్ల తమకు గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధపడి, మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ, లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు.

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది...

యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర

స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన పునరుద్ఘాటించారు.

## ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో సంభాషించారు. గల్ఫ్‌లో కొనసాగుతున్నసంఘర్షణ, ఈ ప్రాంతాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. కువైట్ యువరాజు సబా అల్ ఖలీద్ అల్ సబాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడుల మీద ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒమన్ సుల్తాన్‌తోనూ ప్రధాని మోదీ మాట్లాడారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను నివారించాలని కోరింది. పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది.

## నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీలో పూర్తి ఐక్యత ఉందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం 'పాలు-తేనె' లాంటిదని ఆయన అభివర్ణించారు. మంగళవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీఎం సిద్ధరామయ్య ఇచ్చిన వివరణను సమర్థించారు. విపక్ష నాయకులు రాజకీయ దురుద్దేశంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని, సీఎం అనుభవంతో మాట్లాడారని కొనియాడారు. "మా ఇద్దరి మధ్య బంధం పాలు-తేనెలా కలిసిపోయింది. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి మార్పుపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చ జరగలేదని డీకే స్పష్టం చేశారు. అలాగే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా తాను ఆరేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మార్చి 10న ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేపీసీసీ అధ్యక్ష పదవిలో తన కొనసాగింపుపై స్పందిస్తూ.. కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమైనవని సీఎం సిద్ధరామయ్య ఇదివరకే కొట్టిపారేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ తాము పార్టీ హైకమాండ్‌కు కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు మరోసారి స్పష్టం చేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ మార్పు విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీకే తెలిపారు.



ఈ ఘటనతో విశ్వకర్మ కాలనీ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పండుగ రోజు ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలచివేసింది. చెరువులు, నీటి వనరుల వద్ద భద్రతా చర్యలు లేకపోవడం వల్లనే ఇలాంటి ప్రాణ నష్టం వాటిల్లిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. పండుగల సమయంలో యువత సరదాగా నీటిలోకి దిగే సందర్భాల్లో తల్లిదండ్రులు, అధికారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# విషాదాన్ని నింపిన... 'హోలీ' పండుగ

## సూరారం పంతులు చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు ఇంటర్ విద్యార్థుల మృతి..



చెరువులో పడి మృతిచెందిన అభిషేక్ (17), సాగర్ (17)..

- కుత్బుల్లాపూర్ సూరారం పియస్ పరిధిలో ఈత తెలియక ఇద్దరు విద్యార్థులు మృతి..
- హోళీ సరదా స్నానం ప్రాణాంతకంగా మారింది..
- ఈత రాకపోతే చెరువులు, నదుల్లోకి దిగొద్దని హెచ్చరిక బేఖాతర్..
- పండుగల సమయంలో పిల్లల కదలికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి..
- భద్రతా ఏర్పాట్లు లేని చెరువులు, కుంటలు "డెత్ ట్రాప్"లుగా మారుతున్న వైనం..
- మృతులు బహుదూర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్..

ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని..! ఈతపై విద్యార్థి దశనుండే ఒక అవగాహన కల్పించాలని..! వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతల చుట్టూ ప్రదక్షిణలు..! ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల చుట్టూ తిరిగుతూనే వినతిపత్రాలు అందజేస్తూ..! ఓ సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవిందర్ ముదిరాజ్, గత ఇరవై ఏళ్ళుగా, ఫ్లెక్సీలతో ప్రచారం చేసినప్పటికీ ఇలాంటి మరణాలు ఆపలేక పోతున్నామనే ఆవేదన, అసహనం వ్యక్తం చేస్తున్నారు.. మంగళవారం సూరారం పంతులు చెరువులో ఇద్దరు విద్యార్థుల మృతికి ఆయన దిగ్భ్రాంతి చెందారు.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈతన పాఠ్యాంశంగా చేర్చాలని ఆయన వేడుకున్నాడు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 3:

### ఇద్దరూ ఇంటర్మీడియట్ విద్యార్థులే..

మృతులు ఇద్దరూ బహదూర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థులని పోలీసులు తెలిపారు. హోలీ సందర్భంగా స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్న వారు, ఆతర్వాత సరదాగా చెరువులోకి దిగి మృత్యువాత పడ్డారు.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదవశాత్తు మునిగి మృతి జరిగిందా..? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా..? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది..



మృతుని ఫైల్‌ఫోటో..



మృతుని ఫైల్‌ఫోటో..

రంగుల పండుగ రంగోళీ ఆనందాలు క్షణాల్లో విషాదంగా మారిన ఘటన కుత్బుల్లాపూర్ సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విశ్వకర్మ కాలనీ సమీపంలో ఉన్న పంతులు చెరువులో ఈతకు దిగిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందారు.. ఈ ఘటన స్థానికులను, కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచేసింది. సూరారం పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, విశ్వకర్మ కాలనీలో నివాసం ఉంటున్న సాగర్ (17), అభిషేక్ (17)లు బహుదూర్‌పల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు.. మంగళవారం హోలీ సంబరాలు జరుపుకున్నారు.. అనంతరం స్నానానికి సూరారం గ్రామ పరిధిలోని లేక్ఐడి నెంబర్.2873 పంతులు చెరువులోకి దిగారు. అయితే ఇద్దరికీ ఈత రాకపోవడంతో లోతైన నీటిలో మునిగి ప్రమాదానికి గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.. స్థానికులు గమనించి వెంటనే సూరారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తక్షణమే డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) హైడ్రా, ఫైర్ బృందాలను రంగంలోకి దించారు..సహాయక బృందాలు గంటల తరబడి గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు సూరారం ఇన్‌స్పెక్టర్ సుధీర్ బాబు మీడియాకు తెలిపారు..



చెరువు వద్ద సూరారం వాసులు..




మీడియా సమావేశంలో సూరారం ఇన్‌స్పెక్టర్ సుధీర్ బాబు..

---

## నోటీసులతో..! సెటిల్మెంట్‌లు..?

హద్దుమీరుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారుల విధుల నిర్వహణ..!

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నిజాంపేట్ సర్కిల్‌లో..! అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం..!





మియాపూర్ రహదారి ప్రగతి నగర్ కమాన్ పక్కన ఉన్న ఫర్నీచర్ షాపులు దగ్ధం..

### ప్రగతినగర్‌లో ఫర్నిచర్ షాపులు దగ్ధం.. ఎగిసి పడుతున్న మంటలు..
### బాచుపల్లి విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి కళాశాల సమీపంలో ఘటన..

దుండిగల్, పెన్ పవర్, మార్చి 3: సైబరాబాద్ పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ కమాన్ సమీపంలో ఉన్న కె.జి.ఆర్ కన్వెన్షన్ పక్కన నిర్మించిన ఫర్నిచర్ షాపుల్లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో, మియాపూర్ వెళ్ళే రహదారి పక్కనే కావడం ఈ అగ్నిప్రమాద ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది.. స్థానికుల కథనం ప్రకారం, ఎమ్మెల్సీ నవీన్ రావు మామ దామోదర్ రావుకు చెందిన స్థలంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే షాపులు నిర్మించి, ఫర్నిచర్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.. అగ్నిప్రమాదంలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్షణాల్లో మంటలు వ్యాపించి షాపుల్లో ఉన్న ఫర్నిచర్ పూర్తిగా కాలిపోతుండటాన్ని స్థానికులు ఆ దృశ్యాలు చిత్రీకరించారు.. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు.. అప్పటికే ఫర్నీచర్ అగ్నికి ఆహుతి అయింది.. అర్ధరాత్రి అయినందున ఆ ప్రాంతం అంతా పొగతో కమ్ముకుపోయింది.. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా..? లేక మరేదైనా కారణమా..? పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.. అనుమతుల్లేకుండా నిర్మాణాలు, భద్రతా ప్రమాణాల లోపంతో పాటు, పక్కపక్కనే వందలాది షాపులు ఆనుకుని ఉండటంతో, ప్రమాద తీవ్రత భారీగా పెరిందని, సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఈ ప్రమాదం కారణంగా స్థానికులు ఆరోపిస్తున్నారు



అర్ధరాత్రి అగ్నిప్రమాదం.. కాలి బూడిదైన ఫర్నీచర్ షాపులు




మల్లంపేట్‌లో అక్రమ షెడ్లకు టౌన్‌ప్లానింగ్ నోటీసులు ఇచ్చిన నాటి .. ఫైల్‌ఫొటో..

# నోటీసులతో..! సెటిల్మెంట్‌లు..?

## హద్దుమీరుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారుల విధుల నిర్వహణ..!

- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ నిర్వాకం..
- "నోటీసులు-సీజింగ్‌ల"తో అక్రమ నిర్మాణాల దందా..! అధికారుల పాత్రే కీలకం..?
- నిత్యం ఫీల్డ్‌లో ఉండే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చైన్‌మెన్ విధులు ఏంటి..?
- చైన్‌మెన్ విధులు సెటిల్మెంట్‌ల కోసమా..? అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసమా..?
- బౌరంపేట్ డిపిఎస్ ఎదురుగా భారీ అక్రమ షెడ్డుపై ఫిబ్రవరి 20న ఏసిపి దృష్టికి..
- వెంటనే నోటీసులు ఇచ్చామని చెబుతున్న లోకల్ చైన్‌మెన్ వేణుగౌడ్..
- మార్చి 3 నాటికి షెడ్డు ఎలా పూర్తయిందో చెపుతారా..?ముడుపులతో సక్రమమైందా..?
- మల్లంపేట్‌లోని గ్రీన్‌పార్క్ అసోసియేట్‌లో ఎనిమిది అక్రమ కమర్షియల్ షెడ్లు..
- సుమారు నెలరోజుల క్రితమే నోటీసులు జారీ-చేసినట్లు సమాచారం..!
- ప్రస్తుతం నోటీసులు ఇచ్చిన అవే షెడ్లలో వ్యాపార సముదాయం ఎలా సాధ్యం..?
- టిజి-బిపాస్ చట్టాలు చుట్టంగా..! నోటీసులే ఆదాయంగా..?
- నోటీసులు ఇచ్చాక నిర్మాణాలు ఎలా పూర్తవుతున్నాయి..? సెటిల్మెంట్‌లేనా..?
- మల్లంపేట్‌లో పదుల సంఖ్యలో అక్రమ కట్టడాలకు 3 నెలల క్రితమే సెటిల్మెంట్..?
- దుండిగల్ ఉప కమిషనర్- కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఉన్నా పర్యవేక్షణ సున్నా..!

- అంతా బహిరంగమే..! ఉన్నతాధికారులకు వాటాలు..? మరి పట్టించుకునేది ఎవరు..?
- అక్రమ కట్టడాల నియంత్రణే లేనప్పుడు.! "టౌన్‌ప్లానింగ్" వ్యవస్థ దేనికి వసూళ్ళకా..!
- అక్రమార్కుల కంటే.. అధికారుల చేతివాటమే మిన్న..?




బౌరంపేట్‌లో అధికారుల నోటీసుల తర్వాత షెడ్డు నిర్మాణం..

టిజి-బిపాస్ చట్టం దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు చుట్టంగా మారింది..! పట్టణ ప్రణాళికలో "ఏసిపి-టిపిఎస్" ఏదో ఉద్ధరించినట్టు, వీళ్ళకు తోడు టౌన్‌ప్లానింగ్ అదనపు సిబ్బంది (ఫీల్డ్ స్టాఫ్) పేరుతో ఔట్ సోర్సింగ్ నుండి చైన్‌మెన్‌ల నియామకం ఒకటి..! ఈ నియామకం సెటిల్మెంట్‌ల కోసమే అన్నట్టు తయారైంది.. అక్రమ నిర్మాణం ఏదైనా..! ఎన్ని నోటీసులు జారీచేసినా..! సీజ్ చేసినా..! అప్పుడప్పుడు "ఫొటోషూట్" చర్యలు (నివేదికల కోసం) చేపట్టినా చివరికి సెటిల్మెంట్‌లే శరణ్యం అంటూ సర్వత్రా ఎద్దేవా చేస్తున్నారు.. కాదని ఏసిపి చెబుతారా..? "సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్ అధికారులపై గతంలో "నలుగురు కమిషనర్‌లు- నలుగురు టౌన్‌ప్లానింగ్ అధికారులపై" 'విజిలెన్స్ విచారణలు' అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.. దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అంటేనే కరెప్షన్ అని మొన్న జరిగిన ఏసిబి దాడులు అందుకు నిదర్శనం..

దుండిగల్, పెన్ పవర్, మార్చి 3:

### మల్లంపేట్‌లోనూ నోటీసులిచ్చిన షెడ్లలో..!దర్జాగా "వ్యాపారం"..

టౌన్‌ప్లానింగ్ "అధికారులా- మజాకానా".. అందులో దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అంటేనే ఒక ప్రత్యేకతగా చెప్పవచ్చు.. కరెప్షన్ అధికారులకి నిలయంగా మారిందని మొన్నటి "ఏసిబి దాడుల"తో తేటతెల్లం అయింది.. ఇంత జరిగినా టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరులో మార్పు రాకపోవడం బాధాకరం.. అవే అక్రమ షెడ్లు, అవే అక్రమ నిర్మాణాలు, అధికారుల సహకారం అదేవిధంగా ఉందని స్పష్టమవుతుంది.. దుండిగల్ సర్కిల్ మల్లంపేట్‌లో అక్రమ నిర్మాణాలు దాదాపు పదుల సంఖ్యలో ఉన్నప్పటికీ మొక్కుబడిగా ఓ రెండు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు.. ఈ అక్రమ నిర్మాణాల వ్యవహారంలో గతంలో ఓ చైన్‌మెన్ ఒప్పందంతో సెటిల్మెంట్‌లు జరిగినట్లు తెలుస్తోంది.. అందుకే సింగిల్ నోటీసు వద్దనే చర్యలు స్తంభించాయి.. మల్లంపేట్ గ్రీన్‌పార్క్ అసోసియేట్ వెంచర్‌లో ఓ వ్యక్తి ఎలాంటి పర్మిషన్ లేకుండా, వరుసగా దాదాపు ఎనిమిది కమర్షియల్ షట్టర్‌లు నిర్మించాడు.. పెన్ పవర్ వరుస కథనాలకు నోటీసులిచ్చిన అధికారులు "అంతర్గతంగా సెటిల్మెంట్‌లు" చేసుకుని వదిలేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.. ప్రస్తుతం ఆ ఎనిమిది కమర్షియల్ షట్టర్‌లు షాపులతో వ్యాపార సముదాయంగా మార్చారు.. ఈ షట్టర్‌ల వ్యవహారంలో ఓ అధికారి ప్రమేయం ఉన్నట్టు వినికిడి.. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో ఓ చైన్‌మెన్ ఆధ్వర్యంలో జరిగినట్టు సమాచారం..



బౌరంపేట్ లహరి వెంచర్‌లో అక్రమ సెల్లార్‌తో నిర్మాణం.. అనుమతులకు విరుద్ధంగా..





దుండిగల్ సర్కిల్ మున్సిపాలిటీగా ఉన్నప్పటి నుంచి టౌన్‌ప్లానింగ్‌లో కరెప్షన్ తాండవిస్తూనే ఉంది..! ఒక్క మాటలో చెప్పాలంటే..! కొందరు అవినీతి అధికారుల ఆధాయాన్ని మరింత పెంచేందుకు.. ఈ విలీన ప్రక్రియ తోడైందని కూడా, మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది..? మరోవైపు అక్రమ కట్టడాలకు అనధికారికంగా సహకారించడానికి చట్టబద్ధత కల్పించారేమో అనే అనుమానాలను రేకెత్తిస్తుంది.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ టిపిఎస్ సంజునాపై ఏసిబి దాడులు కేసునమోదు చేసినా.. ప్రస్తుతం విధుల్లో ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు భయం లేకుండా పోయింది.. అక్రమ షెడ్లు, నిర్మాణాలకు నోటీసులు జారీచేసిన దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బరితెగించి వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. టౌన్‌ప్లానింగ్ అధికారుల అక్రమార్జనకు "చైన్‌మెన్‌లు" (ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు) సెటిల్మెంట్‌ల వ్యవహారంలో కీలంగా ఉన్నారని..? తక్షణమే తప్పుడు చైన్‌మెన్‌లను గుర్తించి, ఇతర శాఖలకు మార్చాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు..

### బౌరంపేట్‌లో అక్రమ షెడ్డుపై 'ఏసిపి' నిర్లక్ష్యం..

దుండిగల్ సర్కిల్ పట్టణప్రణాళిక అధికారుల నిర్లక్ష్యమో..! లేక తమకు ఎదురు ఎవరు అనే, బరితెగింపో తెలియదు కానీ..! అక్రమ నిర్మాణాల పట్ల టౌన్‌ప్లానింగ్ తీరు పలువురికి ఆగ్రహం తెప్పిస్తుంది.. బౌరంపేట్ "డిల్లీ పబ్లిక్ స్కూల్" ఎదురుగా ఓ భారీ అక్రమ షెడ్డుకు ఉన్న అనుమతులపై వివరణ కోరుతూ దుండిగల్ సర్కిల్ "అసిస్టెంట్ సిటీ ప్లానర్" ఫిబ్రవరి-20న షెడ్డు ప్రారంభ దశలోనే దృష్టికి తీసుకెళ్ళగా..! నోటీసులు ఇచ్చినట్టు స్థానిక చైన్‌మెన్ వేణుగౌడ్ చెప్పాడు.. హాస్యాస్పద విషయం ఏమిటంటే, నోటీసులు అంటే అక్రమ షెడ్లను, కట్టడాలను ప్రోత్సహించడానికే అన్నట్టు స్పష్టతను ఇస్తున్నారు.. మార్చి-3న సంబంధిత అక్రమ షెడ్డు పూర్తిచేయడం టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతికి నిదర్శనంగా విమర్శిస్తున్నారు.. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారి "ఏసిపి" శ్రీనివాస్ దృష్టికి మార్చి 2న వాట్సప్‌లో ఫొటోలతో దృష్టికి తీసుకెళ్ళినా సమాధానం లేదు.. బౌరంపేట్ సాయిబాబా గుడి సమీపంలో అక్రమ కట్టడాన్ని, ఇప్పటికే రెండు సార్లు కూల్చేశామని,ఒక నోటీసు ఇచ్చామని, గొప్పగా చెప్పుకునే టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే నిర్మాణం పూర్తి దశకు వచ్చింది, టౌన్‌ప్లానింగ్ సిగ్గుపడాల్సిన విషయం ఏమిటంటే, చర్యలు తీసుకున్నప్పటికీ..! అక్రమ నిర్మాణ దారుడు "పెంట్ హౌస్" నిర్మాణం చేపట్టాడంటే..! అధికారులకు సెటిల్మెంట్ కాకుండా సాధ్యమేనా..? జోనల్ కమిషనర్ దీనికి సమాధానం చెబుతారని ఆశిస్తున్నాం..



బౌరంపేట్‌లో రెండుసార్లు చర్యలు, ఒక నోటీసు జారీ.. తరువాత మరో అంతస్తు..




మల్లంపేట్‌లో నోటీసులు ఇచ్చామని చెబుతున్న మరో నాలుగు అక్రమ షెడ్లు..

# తమ్మినేనిపై వేటు



**హైదరాబాద్, మార్చి 3, పెన్ పవర్:** తెలంగాణకు చెందిన సీపీఎం సీనియర్ నేత, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై ఆ పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను అభిశంసిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన తప్పుడు రాజకీయ వైఖరి, పార్టీ నిబంధనల ఉల్లంఘనలే ఈ చర్యకు కారణంగా పేర్కొంది.రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యయుత చర్చకు బదులుగా లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద రాజకీయాలు నడిచాయని కేంద్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాలతో పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిపోయిందని, ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరిందని తన నివేదికలో స్పష్టం చేసింది. పార్టీలో ఐక్యతను నెలకొల్పేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, తమ్మినేని సహా నాయకత్వంలోని ఒక వర్గం వెనక్కి తగ్గడానికి నిరాకరించిందని తెలిపింది.సీనియర్ నాయకులే తెరవెనుక మంత్రాంగాలు, ప్రచారాలు చేయడం పార్టీ ఁ

సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని కేంద్ర కమిటీ దుయ్యబట్టింది. ఈ పరిణామాలపై తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, ప్రసాద్‌ల నుంచి వివరణ కోరినట్లు వెల్లడించింది. అయితే, వారు సమర్పించిన వివరణలు అసమగ్రంగా ఉండటంతో పాటు వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురినీ అభిశంసిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో తెలంగాణ సీపీఎంలో నెలకొన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పిల్లలను చంపి తల్లి సూసైడ్

**యాదాద్రి భువనగిరి పెన్ పవర్:** ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. బీబీనగర్ మండలం గొల్లగూడెంలో తెల్లవారుజామున ఘోరం జరిగింది. వివాహిత తన ఇద్దరు పిల్లలను చంపి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే కారణమా లేక మరేదైనా సమస్య ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## డబుల్ కష్టాలు

**నల్గొండ, మార్చి 3, పెన్ పవర్:** ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను అందజేస్తుంది. దానిలో భాగంగానే గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు కట్టించి అందజేసింది. ఇంతవరకు బానే ఉన్నా వాటి నిర్మాణంలో నాణ్యతతో కూడిన పనులు చేయకపోవడం, అక్కడ సరైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అనేక చోట్ల అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇదే విధానం మండలంలోని విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లోనూ కొనసాగుతోంది. 2020లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఇండ్లు పూర్తయి రెండు సంవత్సరాలైనా అర్హులైన పేదలకు పంపిణీ చేయాలేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో 2023లో ధర్నా నిర్వహించగా అప్పుడు అర్హులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్ నాణ్యతలేని సిమెంటుతో కట్టడంతో ఆ ఇండ్లు ఇప్పుడు శిధిలావస్థకు చేరాయి.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చిన సంతోషం లేకుండా కారు చీకట్లో మగ్గుతున్న కాలనీ వాసుల దుస్థితి కి నిదర్శనం మండల కేంద్రంతో పాటు విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇచ్చిన ఇండ్లు ఆర్భాటంగా ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలైన కరెంట్, త్రాగునీటి సౌకర్యం , సి సి రోడ్లు లేక వచ్చిపోయే వర్షాలతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి బురదతో కంపు కొడుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అలాగే ఈగలు, దోమలు, స్త్వైరవిహారం చేస్తున్నాయని, కారుచీకట్లో పాములు, తేళ్ళ బెడదతో సతమతం అవుతున్నామని లబ్ధిదారులు ఇప్పటికే పలుసార్లు మండల అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి లకు పిర్యాదు చేసిన పలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.కనీసం గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా చెత్త సేకరణకు రావడం లేదని దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకపోయి కంపు కొడుతున్నదని డబుల్ బెడ్ రూమ్ గృహ నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డబుల్ బెడ్ రూమ్ నివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని అన్ని వసతులు కల్పించి అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసి త్రాగునీరు, విద్యుత్తు, సైడ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు వసతులను కల్పించకుండా వదిలేసిసింధీ. అప్పటి నుండి ఇప్పటి వరకు సమస్యలు మాత్రం తేలడం లేదు. డబల్ బెడ్ రూమ్ గృహనివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని ఈ ప్రభుత్వమైనా వసతులను కల్పించాలి.

## కూల్చివేతలపై తీవ్రమవుతున్న విమర్శలు

**నల్గొండ, మార్చి 3, పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొంది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది.ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోంది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలకు ప్రభుత్వం అస్త్రాలను అందించినట్లయింది. ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనల ప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా, పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, వారిని ఒప్పించిన తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిపక్షంలో, ఈ కూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# గుడిసెల కూల్చివేత చుట్టూ రాజకీయ దుమారం

**ఖమ్మం, మార్చి 3, పెన్ పవర్:** ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఉన్న పేదల ఇళ్ల కూల్చివేత పొలిటికల్ హైడ్రామాకు దారితీసింది. భూదాన్ భూములు రెవెన్యూశాఖ పరిధిలో ఉంటాయి. అందులో కూల్చివేతలు చేపడితే..సంబంధిత శాఖ మంత్రికి సమాచారం ఉంటుంది. పైగా రెవెన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లాకే చెందిన మినిస్టర్. దీంతో పలువురు ప్రజా సంఘాల నేతలు భూదాన్ భూముల్లో కూల్చివేతలపై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారట.అయితే కూల్చివేతల విషయం తనకు తెలియదని..ఖమ్మం కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారట మంత్రి పొంగులేటి. దీంతో రెవెన్యూ శాఖ మంత్రి, పైగా జిల్లా మినిస్టర్ పొంగులేటికి తెలియకుండా కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంటుందా అన్న చర్చ జరుగుతోంది. అలా అయితే పొంగులేటిని కాదని కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? అధికారులే సొంత నిర్ణయం తీసుకుని డిమాలిషన్ చేశారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వెలుగుమట్ల ప్రాంతంలో గజం లక్షల రూపాయలు, ఎకరం కోట్ల రూపాయలు పలుకుతుందట. ఆ ప్రాంతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులకు భూములు ఉన్నాయని..లేదు మంత్రి పొంగులేటి సంబంధికులకే అక్కడ ల్యాండ్స్ ఉన్నాయని మరొకరు ఆరోపణలు చేసుకుంటుడం చర్చకు దారితీస్తోంది.తమ ల్యాండ్ పక్కనే భూదాన్ భూముల్లో పేదలు గుడిసెలు ఉంటే..తమ భూముల ధర పడిపోతుందనే సాకుతో ఆ భూముల్లో ఉంటున్న పేదల ఇళ్లను తొలిగించారనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని లేపుతున్నాయి. అయితే పేదల ఇళ్లు తొలగింపుకు మంత్రికి ఎటువంటి సంబంధం లేదని తుమ్మల అనుచరులు కొట్టిపారేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై రాజకీయ జోక్యం ఎలా ఉంటుందని ఎదరు ప్రశ్నలు వేస్తున్నారట. కూల్చివేతలపై తనకు సమాచారమే లేదని పొంగులేటి చెబుతున్నారు.ఖమ్మం జిల్లాలోనే ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరిలో అందరికి కీలకమైన మంత్రి పదవులే ఉన్నాయి. అయితే పాలేరు ఎమ్మెల్యే, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవన్యూ శాఖ మంత్రికి తెలియకుండా భూదాన్ భూముల్లో కూల్చివేతలు సాధ్యమేనా.? అన్న



డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కూల్చివేతపై సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మంత్రి పొంగులేటిని ప్రశ్నించారు. కలెక్టర్ అనుదీప్‌కు ఫోన్ చేసి పేదల ఇళ్ల కూల్చివేతపై సీరియస్ అయ్యారు పొంగులేటి. తన శాఖకు సంబంధించి తనకు తెలియకుండా ఎలా కూల్చివేస్తారు..ఇదేం పద్దతి అంటూ మండిపడ్డారు. ఇళ్లు కూల్చివేసిన భూదాన్ భూములు ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని..ఖమ్మం నియోజకవర్గం మంత్రి తుమ్మలది కాబట్టి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొస్తున్నారట మంత్రి పొంగులేటి. ఇళ్లు కూల్చివేసిన తర్వాత పలు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. ఘటనాస్థలిని సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అధికార పార్టీ మాత్రం తమకు ఎటువంటి సంబంధం లేదు..కోర్టు తీర్పును అధికారులు అమలు చేశారని చెప్పుకొస్తోంది.మంత్రి పొంగులేటి తనకేం సంబంధం లేదంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇటు తుమ్మలకు సంబంధం లేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. అలాంటప్పుడు భూదాన్ భూముల్లో కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి తెలియకుండానే డిమాలిషన్ చేపట్టారా.?తుమ్మల ప్రమేయం ఉందా? లేక ఆయన నియోజకవర్గ పరిధిలో కూల్చివేతలు జరిగాయి కాబట్టి అలిగేషన్స్ వస్తున్నాయా? అధికారులే కోర్టు ఆర్డర్స్ ప్రకారం ముందుకెళ్లారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైతే కూల్చివేతల వెనుక ఎవరున్నరన్నది క్లారిటీ లేదు. కాకపోతే ఖమ్మం జిల్లా మంత్రుల మధ్య మాత్రం కూల్చివేతలు కొత్త చిచ్చు పెట్టినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. భూదాన్ భూముల్లో పేదల కూల్చివేత ఇష్యూ ఎటుదారితీస్తుందో చూడాలి మరి.

# సనత్‌నగర్ టిమ్స్‌లో 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్

**హైదరాబాద్, మార్చి 3, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 1000 పడకల సామర్థ్యంతో ఈ హాస్పిటల్ నిర్మిస్తుండగా.. ఉగాది నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక టిమ్స్‌లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. పేషెంట్లకు సత్వర వైద్యం అందించేందుకు న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. ఓ గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఇటువంటి టెక్నాలజీ తీసుకురావటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో హైదరాబాద్ సనత్‌నగర్‌లో ప్రభుత్వం తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ హాస్పిటల్ ప్రారంభానికి ఇటీవల ముహూర్తం కూడా ఖరారు చేశారు. ఉగాది పండుగ రోజున అంటే మార్చి 19న ఈ ప్రతిష్టాత్మక 1000 పడకల ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం డిసైడ్ అయింది.ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇక టిమ్స్ హాస్పిటల్ అందుబాటులోకి వస్తే తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో ఒక సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. టిమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్' అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ తరహా సాంకేతికతను ప్రవేశపెట్టడం రాష్ట్రంలోనే ఇదే తొలిసారిసాధారణంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో కనిపించే ఈ విధానంలో గాలి పీడనం ద్వారా పనిచేసే పైప్‌లైన్ నెట్‌వర్క్ ఉంటుంది. దీని ద్వారా బ్లడ్ శాంపిల్స్ లేదా ఇతర మెడికల్ శాంపిల్స్‌ను హాస్పిటల్‌లోని ఒక విభాగం నుంచి మరొక విభాగానికి సెకన్ల వ్యవధిలో చేరవేయవచ్చు. అత్యవసర సమయాల్లో సిబ్బంది స్వయంగా ల్యాబ్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, నిర్దేశిత స్టేషన్లలో శాంపిల్స్ ఉంచితే అవి నేరుగా ల్యాబ్‌కు చేరుకుంటాయి. ల్యాబ్ టెక్నీషియన్లు వెంటనే టెస్టులు నిర్వహించి, డిజిటల్ రూపంలో రిపోర్టులను క్షణాల వ్యవధిలోనే డాక్టర్లకు పంపుతారు. దీనివల్ల రోగుల నిరీక్షణ సమయం గణనీయంగా తగ్గుతుంది.ముఖ్యంగా యాక్సిడెంట్లు, గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో లేదా ఆపరేషన్ థియేటర్లలో రోగికి రక్తం ఎక్కించాల్సి వచ్చినప్పుడు ఈ వ్యవస్థ ప్రాణదాతగా మారుతుంది. తక్కువ సమయంలోనే క్లినికల్ నిర్ణయాలు తీసుకునేందుకు ఇది డాక్టర్లకు తోడ్పడుతుందని టిమ్స్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహబూబ్ ఖాన్ వెల్లడించారు. ప్రభుత్వ వైద్య సేవలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని రూపొందించినట్లు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఏ నరేంద్ర తెలిపారు. న్యుమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌తో పాటు, ఇన్ఫెక్షన్లు సోకకుండా ఉండేందుకు ప్రత్యేకమైన 'డర్టీ కారిడార్స్' వంటి నూతన డిజైన్లను ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్ అందుబాటులోకి వస్తే సామాన్యులకు అత్యున్నత స్థాయి సాంకేతిక వైద్య సేవలు వేగంగా అందనున్నాయని అన్నారు.

# కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపాను

**హైదరాబాద్, మార్చి 3, పెన్ పవర్:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు.

తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం

లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

# హోలితోనే నామకరణాలు

**ఖమ్మం పెన్ పవర్:** హోలీ పండుగకు ఆ తండాకు ఓ ప్రత్యేకత ఉంది... పుట్టిన బిడ్డకు నామకరణం చేయాలంటే హోలీ పండుగ రావాల్సిందే... ఘనంగా హోలీ అడాల్సిందే... ఆనందం,ఆప్యాయత, అనురాగం, అనుబందం,అపూర్వం,ఆత్మీయత,అద్వితీయం,అద్దరికలయిక....ఆ కర్షితమైన అద్భుతమైన వేడుకలకు కేరాప్ హోలీ . గ్రామ గ్రామాలకు నడుమ గడియ దూరంలో ఉండే గిరిజన కుటుంబాలను ఒకే గూటికి చేర్చి సంబరాలు చేసే పండుగ హోలీ ...ఈ హోలీ ని గిరిజనులు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ,యువకుల నుంచి వృద్దుల వరకు ఈ హోలీ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.ఇలాంటి సంబరాలుకు కేరప్ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా...

......ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా లో గిరిజన సంస్కృతి కి అద్దం పట్టే విదంగా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఈ హోలీ సంబరాలు తండాలో మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకున్నారు. హోలీ సంబరాలకు గిరిజనులు రూ. కొట్టి వరకు ఖర్చు చేస్తారు.మెదటి రోజు తెల్లవారుజామునమూడు గంటల నుంచే కాముని దహనం కార్యక్రమం ప్రారంబమవుతుమది.

కుల పెద్దలైన... గేడియగా పిలవబడే తండా పెద్దలు లాంఛనంగా ప్రారంభిస్తారు.పుట్టిన బిడ్డలకు నామకరణం చేస్తారు. తండాలో హెులీ రోజు నుంచి పుట్టిన ప్రతి బిడ్డకు మళ్లీ హెులీ పండుగ రోజు మాత్రమే నామకరణం చేయడంఆనవాయితీ,అప్పటివరకు పుట్టిన




బిడ్డలకు నామకరణం చేయరు.మూడోరోజు తండా వాసులు రంగోలి ఆడుతారు.కాముని దహనం చేసిన ప్రాతం నుంచి సేకరించిన బూడిదను తండా యువకులు శరీరం పై చల్లుకిని ఆ తర్వాత రంగులు చల్లుకుంటు ఆడుకుంటారు.మూడు రోజుల వేడుకతో లోక్యాతండ జనసందడితో కిటకిటలాడింది. హోలీ వేడుకలకు తండావాసులు తమ బందువులను తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. తండా వాసులు ఎక్కడ స్థిరపడినా హోలీ రోజు మాత్రం లోక్యాతండాకు చేరుకోటారు. ప్రతి హోలీ పండుగకు గ్రామంలో మహిళలు కొత్త వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. నూతన వస్త్రాలు ధరించి హోలీ జరుపుకుంటారు. మూడో రోజు కావడంతో హోలీని గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. పెద్దల నుంచి చిన్నారుల వరకు రంగులు చల్లుకుని ఆటపాటలతో డ్యాన్సులు నృత్యాలు చేస్తూ హోలీ నిర్వహించారు.

# ఫీజుల నియంత్రణకు కసరత్తు..

**హైదరాబాద్, మార్చి 3, పెన్ పవర్:**
ప్రస్తుత కాలంలో పిల్లల స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిపోతున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీలకే లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్కూళ్ల పరిస్థితి.. అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అక్కడ అందున్న విద్యాబోధన తదితర అంశాలను, ఆ పాఠశాలకు సంబంధించి గత రికార్డులను బేరీజు వేసుకొని ఫీజులను నిర్ణయించేందుకు సర్కార్ సిద్ధమైంది.తెలంగాణ వ్యాప్తంగా 11వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. మరో నెల రోజుల్లో 2025-26 విద్యా సంవత్సరం ముగియనుంది. వచ్చే విద్యా సంవత్సరంకు సంబంధించి పలు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. అయితే, కొన్ని పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేస్తూ.. శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.ప్రతి రెండేళ్లకోసారి 8శాతం మాత్రమే ఫీజు పెంచుకునేలా ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ముమ్మరమైంది. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూళ్లో ఎంత ఫీజు ఉంది..? ఏఏ క్లాసులకు ఎంతెంత తీసుకుంటున్నారు..? అనే వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో దేని ఆధారంగా బేస్ ఫీజులను నిర్ణయించాలనేదానిపై అధికారులు కసరత్తు చేశారు.ఆయా స్కూళ్ల నిర్వహణ ఖర్చుల ఆధారంగానే స్కూళ్ల ఫీజులు ఉండాలని విద్యాశాఖ భావిస్తోంది. దీనికోసం గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేస్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు.విద్యాశాఖపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి లేదా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని నిర్దేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు.మరోవైపు.. ఫీజుల నియంత్రణ పక్కాగా అమలు చేసేందుకు స్టేట్ లెవల్ ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని గానీ, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీనిగాని నియమించాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఫీజుల నియంత్రణను చేపట్టాలని ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేపట్టింది.

# రాజ్యసభ రేసులో 12 మంది

**హైదరాబాద్, మార్చి 3, పెన్ పవర్:**
తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం తీవ్ర పోటీనే నడుస్తోంది. దాదాపు డజను మంది నేతలు రేసులో ఉన్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలు పోటీ పడుతున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఈరవత్రి అనిల్ కుమార్, మహిళా కోటాలో ఇటీవలే ఉమెన్ కమిషన్ ఛైర్మన్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న నేరెళ్ల శారదలు ఉన్నారు.
ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య, మైనారిటీ నుండి అజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి కుసుమకుమార్ ఢిల్లీ స్థాయిలో పైరవీ చేస్తున్నారు. ఖాళీ అవుతున్న రెండు సీట్లలో ఒకటి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సుప్రీంకోర్టు అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి ఇవ్వాలని హైకమాండ్ ఎప్పుడో డిసైడ్ అయిందంటున్నారు. ఇప్పటికే తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనను కంటిన్యూ చేయడం ఖాయమైపోయింది. ఇక రెండో సీటు కోసం పోటీ మామూలుగా లేదు. అయితే ఈ సీటు కూడా ఇప్పటికే పార్టీ అధిష్టానం డిసైడ్ చేసిందనే చర్చ పార్టీలో జోరుగా వినిపిస్తోంది.రెండో రాజ్యసభ సీటుకు పార్టీ అధిష్టానం వంశీచంద్ రెడ్డి పేరును ప్రతిపాదిస్తోందట. వంశీచంద్ గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ పాలసీ ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన వారికి మళ్లీ పదవులు



ఇవ్వొద్దని..టికెట్ త్యాగం చేసిన వారికే ప్రయారిటీ ఇవ్వాలని ఒక నిర్ణయం తీసుకున్నారు. కానీ వంశీచంద్ పేరును అధిష్టానం ప్రపోజ్ చేసేసరికి..రాష్ట్ర నాయకత్వం గతంలో అనుకున్న విషయాన్ని తెరపైకి తెచ్చిందట. అయితే వంశీచంద్‌కు ఇవ్వాలంటూ ఏకంగా ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీనే సూచిస్తుండటంతో రాష్ట్ర నాయకత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో పడిపోయిందట.తన విషయంలో రాష్ట్ర నాయకత్వం సహకరించదనే ఆలోచనతో..వంశీ..ప్రియాంక గాంధీతో చెప్పిస్తున్నారని హస్తం పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీకి జాతీయ స్థాయిలో వంశీ అవసరాలున్నాయని..రాజ్యసభ ఎంపీగా ఉంటే పార్టీకి మరింత ఉపయోగం ఉంటుందని ప్రియాంక గాంధీ చెబుతున్నారట. గతంలో జగిత్యాల ఎమ్మెల్యేగా ఓడిన జీవన్‌రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వలేదా అంటూ గుర్తు చేస్తున్నారట హస్తం పార్టీ పెద్దలు.రాజ్యసభ రేసులోకి వంశీచంద్ రావడంతో..కొత్త కొత్త ఆశావహులు తెరమీదకు వస్తున్నారట. వంశీచంద్‌ను సాకుగా చూపి..గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతల్లో చాలామంది రాజ్యసభ సీటు కోసం..తమ పేరును పరిశీలించాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. ఇదే విషయాన్ని రాష్ట్ర నాయకత్వం పార్టీ అధిష్టానానికి చెబుతున్నా.. ప్రియాంకగాంధీ ససేమిరా అంటున్నారట. పార్టీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా డీసీసీల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నందున వంశీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. అలా తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లను భర్తీ చేసేందుకు..కాంగ్రెస్ అధిష్టానమే ఇప్పటికే అభ్యర్థులను ఫైనల్ చేసిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున..నామినేషన్ల గడువులోపు ఈక్వేషన్లు ఏమైనా మారుతాయా? లేక అభిషేక్ మను సింఘ్వీ, వంశీచంద్‌రెడ్డి పేర్లు ఫైనల్ అయినట్లేనా అన్నది చూడాలి.

# వరంగల్ క్రికెట్ ప్రేమికులకు తీపి కబురు

**వరంగల్, మార్చి 3, పెన్ పవర్:**
వరంగల్ జిల్లాలోని క్రికెట్ ప్రేమికులకు, యువతకు గుడ్‌న్యూస్. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు చురుగ్గా పనులు జరుగుతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమట?ల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో ఈ స్టేడియం అందుబాటులోకి రానుందని చెప్పారు. క్రికెట్ స్టేడియం అందుబాటులోకి వస్తే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు కూడా జరిగే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చారు.తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. తెలంగాణను దేశపు క్రీడా రాజధాని మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025ను ప్రవేశపెట్టారు. ఈ పాలసీలో భాగంగా 2036 ఒలింపిక్స్‌లో మన రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం సుమారు 200 ఎకరాల భూమిని కేటాయించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించారు.అందులో భాగంగా.. వరంగల్ జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రెడీ అయ్యారు. ఈ విషయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. త్వరలోనే జిల్లాకు క్రికెట్ స్టేడియం వస్తుందని చెప్పారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డికి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద ఉందని అన్నారు.
కాగా, జిల్లా యువత చాలా కాలంగా క్రికెట్ స్టేడియం కోసం ఎదురు చూస్తోంది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని 163 నేషనల్ హైవేకు సమీపంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలోనే స్టేడియం నిర్మాణం చేపడితే అనుకూలంగా ఉంటుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు.దీంతో కుడా పరిధిలోని 30 ఎకరాల భూమి వివరాలను ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్‌రంజన్‌కు అందజేశారు. ప్రస్తుతం ఈ ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. త్వరలోనే స్టేడియం నిర్మాణానికి అనుమతులు రానున్నాయి. అదే జరిగితే క్రికెట్ ప్రేమికుల చిరకాల కోరిక తీరనుంది. వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే ఛాన్స్ ఉంటుంది.

## బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం మూసివేత

**నిర్మల్ పెన్ పవర్:** కేతు గ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మహా నివేదన అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలకు ఆలయ అర్చకులు ద్వార బంధనం చేసారుత. అమ్మవారి క్షేత్రంలో ఈ రొజు అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేసారు. ఈ రొజు రాత్రి 7 గం.లకు అమ్మవారి ఆలయం తొ పాటు ఉప ఆలయాల ద్వారాలు తెరచి గోదావరి జలాలతొ మహా సంప్రోక్షణ జరిగిన తరువాత మరుసటి రోజు బుధవారం అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు యధావిధిగా కొనసాగుతాయి

## హోలీ సంబరాలు

**ఖమ్మం: పెన్ పవర్:** ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ప హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసి ఆటపాటలతో రంగులు చల్లుకుంటూ హోలీ పండగ ఉత్సాహంగా జరుపుకున్నారు.స్కూల్ సెలవు కావడంతో రంగురంగుల కలర్ , వాటర్ గన్స్, నగరంలోని పలుకూడాల్లో , వీధుల్లో డీజే పెట్టి డాన్సులు వేస్తూ రంగుల చల్లుకున్నారు ముఖ్యంగా మార్వాడీలు పూజల నిర్వహించి భక్తిశ్రద్ధలతో హోలీ ని జరుపుకున్నారు

## సమిష్టి కృషితో టీబీ నిర్మూలన సాధ్యం

**హైదరాబాద్: పెన్ పవర్:** టిబి (క్షయవ్యాధి) నిర్మూలన లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. మందులతో పాటు సరైన పోషకాహారం, మానసిక ధైర్యం కల్పించే కౌన్సెలింగ్ కూడా టిబి రోగులకు ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా టిబి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన్ మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కు అనుసంధానంగా, కేర్ హాస్పిటల్స్ మరియు జగతి ఫౌండేషన్ సంయుక్తంగా "ప్రాజెక్ట్ ఓజాస్" అనే సిఎస్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరిచందన దాసరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
హైదరాబాద్లో టిబి రోగులకు నిరంతర పోషకాహారం అందించడంతో పాటు, మానసిక సహాయం, కౌన్సెలింగ్ సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా టిబి బాధితులకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన పోషకాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టిబి నిర్మూలన లక్ష్యాన్ని త్వరితగతిన చేరుకోవాలంటే సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కేర్ హాస్పిటల్స్ మరియు జగతి ఫౌండేషన్ ముందుకు వచ్చి జిల్లా పరిపాలనకు తోడ్పడటం అభినందనీయమని, ఇటువంటి భాగస్వామ్య కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు.

## అలయ భూములను కాపాడాలని గ్రామస్థుల రిలే నిరాహార దీక్ష

**వికారాబాద్: పెన్ పవర్:** 4 వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిన సంజీవ స్వామి దేవాలయాన్ని పునర్మించాలని,అన్యాక్రాంతం అవుతున్న దేవాలయ భూములను కాపాడలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా దోమ మండలం దొంగ ఎన్కెపల్లి గ్రామస్థులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు.ఆలయం శిథిలమైపోయినా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదని... 104 ఎకరాల దేవాలయ మాన్యాపు భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్మకర్త పేరుతో పరిగి మాజీ సర్పంచ్ పార్థసారథి ఆలయ నిర్మాణ పనులను అడ్డుకోవడమే కాకుండా ఆలయ భూములు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్ళేందుకు కారకులవుతున్నారని ఆరోపించారు.పరిగి, చన్గోముల్ రెవెన్యూ లో ఉన్న ఆలయ భూములను మళ్ళీ ఆలయ రికార్డుల్లోకి ఎక్కించాలని....సంజీవ స్వామి ఆలయ నిర్మాణం కోసం 5 కోట్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

## స్మశానవాటికలో వ్యక్తి ఆత్మహత్య

**వికారాబాద్: పెన్ పవర్:** పరిగి బస్ డిపో ఎదురుగా ఉన్న స్మశానవాటికలోని మర్రి చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్మశానవాటిక పక్క కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు దోమ మండలం పాశంబండ తాండాకు చెందిన దీపక్ (26) గా గుర్తించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు పరిగిలో అద్దెకు ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దీపక్ ఆత్మహత్య కు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ..

## నేలకొండపల్లిలో వైభవంగా శ్రీకృష్ణుడు,రుక్మిణిల కళ్యాణ మహోత్సవం

**ఖమ్మం: పెన్ పవర్:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి లోని శ్రీ సంతాన వేణు గోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడు,రుక్మిణిల కళ్యాణ మహోత్సవం జరిగింది.స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు సంప్రదాయ పద్ధతిలో జరిపించారు. ముందుగా ఎదుర్కోలు ఉత్సవం జరిపిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ని కళ్యాణ మండపం వద్దకు ఉత్సవ మూర్తుల విగ్రహాలను తీసుకొచ్చారు.అనంతరం అంగరంగ వైభవంగా వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కళ్యాణం ఘనంగా జరిపించారు.కళ్యాణం అనంతరం ఆలయ పూజారులు దండలతో ఆడే ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి కల్యాణాన్ని చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం ఇదే రోజు స్వామి వారి కళ్యానాన్ని జరిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది.

## మరణానికి ముందు మెదడులో అసలేం జరుగుతుంది..
# అధ్యయనంలో విస్తుపోయే నిజాలు!



**హైదరాబాద్  పెన్ పవర్:** మనిషి పుట్టుక ఎంతటి రహస్యమో, మరణం కూడా అంతకంటే పెద్ద మిస్టరీ. చనిపోయే ఆ కొన్ని క్షణాల ముందు మన మెదడులో ఏం జరుగుతుంది? మన కళ్ల ముందు జీవితం సినిమా రీల్‌లా కనిపిస్తుందా? అనే సందేహాలకు శాస్త్రవేత్తలు ఇప్పుడు సమాధానం కనుగొన్నారు. ఒక వ్యక్తి మరణించే ముప్పై సెకన్ల ముందు మెదడులో జరిగే వింత పరిణామాలను పరిశోధకులు రికార్డ్ చేశారు. ఆ ఆసక్తికరమైన విషయాలు, మరణం అంచున మెదడు పంపే సంకేతాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

**మరణానికి 30 సెకన్ల ముందు.. మెదడులో మెరిసే జ్ఞాపకాలు:**

మరణం సంభవించే సరిగ్గా 30 సెకన్ల ముందు మన మెదడు అత్యంత చురుగ్గా మారుతుందని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. లూయిస్ విల్ యూనివర్సిటీకి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ అజ్మల్ జెమ్మర్ బృందం, ఒక వృద్ధుడి మెదడు తరంగాలను (జుజు+) పరిశీలిస్తున్నప్పుడు ఈ అద్భుతాన్ని గమనించారు. ఇక గుండె ఆగిపోవడానికి కొద్ది క్షణాల ముందు, మెదడులో మనం కలలు కనేటప్పుడు లేదా పాత విషయాలను గుర్తు చేసుకునేటప్పుడు వచ్చే 'గామా ఆసిలేషన్స్' వంటి తరంగాలు కనిపించాయి. అంటే, మనిషి ప్రాణం పోయే ముందు తన జీవితంలోని అత్యంత మధురమైన, ముఖ్యమైన సంఘటనలను ఒక్కసారిగా నెమరువేసుకుంటాడని ఈ పరిశోధన చెబుతోంది. మనకు ఇష్టమైన వ్యక్తులు, మనం సాధించిన విజయాలు ఒక వెలుగులా మెదడులో మెరిసిపోతాయన్నమాట.

**సైన్స్ ఏం చెబుతోంది? ఎలుకల నుంచి మనుషుల వరకు:**

ఇక మెదడుకు రక్త ప్రసరణ ఆగిపోయిన తర్వాత కూడా కొన్ని క్షణాల పాటు నాడీ వ్యవస్థ పని చేస్తూనే ఉంటుంది. ఈ స్థితిలో మెదడు హైపర్-అలెర్ట్ మోడ్‌లోకి వెళ్తుందని పరిశోధకులు గుర్తించారు. నిజానికి 2013లో ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో కూడా ఇలాంటి ఫలితాలే వచ్చాయి, కానీ మనుషుల్లో ఇది స్పష్టంగా రికార్డ్ అవ్వడం ఇదే తొలిసారి. ఇక మనం గాఢ నిద్రలో ఉన్నప్పుడు లేదా ధ్యానం చేస్తున్నప్పుడు మెదడు ఏ స్థాయిలో అయితే ప్రశాంతంగా, స్పష్టంగా ఉంటుందో, మరణానికి ముందు కూడా సరిగ్గా అదే తరహా స్పందనలు కనిపిస్తాయి. ఇక దీనిని బట్టి మరణం అనేది కేవలం శరీరం ఆగిపోవడం మాత్రమే కాదు, మెదడు తన యజమానిని పంపించే ముందు ఇచ్చే ఒక గౌరవ వందనం లాంటిదని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# ఆకాశంలో నిశ్శబ్ద మృత్యువు: యుద్ధ తంత్రాన్నే మార్చేస్తున్న డ్రోన్లు!



**హైదరాబాద్  పెన్ పవర్:** ఇటీవల వార్తలు చూస్తుంటే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతోంది.. ఆధునిక యుద్ధాల్లో శక్తివంతమైన క్షిపణుల కంటే తెలివైన డ్రోన్లకే ప్రాధాన్యత పెరుగుతోంది. తాజాగా ఇరాన్ తన డ్రోన్లతో రియాద్‌పై, అలాగే అరామ్‌కో ఆయిల్ రిఫైనరీ మీద దాడులు చేసిందనే వార్తలు సంచలనం సృష్టిస్తున్నాయి. అసలు పెద్ద పెద్ద మిస్సైళ్లు ఉండగా, దేశాలు ఈ చిన్న డ్రోన్ల మీద ఎందుకు అంతగా ఆధారపడుతున్నాయి? దీని వెనుక ఉన్న అసలు లెక్కలు ఏంటో తెలిస్తే మీరు కూడా ఆశ్చర్యపోతారు.

**ఖర్చు తక్కువ.. పని ఎక్కువ!**

యుద్ధం అంటేనే భారీ ఖర్చుతో కూడుకున్న పని. కానీ డ్రోన్ల విషయంలో ఈ లెక్కలు పూర్తిగా మారిపోతాయి. ఒక మధ్య శ్రేణి క్షిపణి (వీవసఱఅబఎ ఝఱఅస్త్రవ వీఱంంఱశ్రీవ) తయారు చేయాలన్నా లేదా ప్రయోగించాలన్నా సుమారు 2 మిలియన్ల నుండి 3 మిలియన్ డాలర్లు (అంటే వందల కోట్లు) ఖర్చవుతుంది. కానీ అదే పనిని చేసే ఒక డ్రోన్ ధర కేవలం 35,000 నుంచి 50,000 డాలర్లు మాత్రమే. అంటే ఒక మిస్సైల్ అయ్యే ఖర్చుతో వందల సంఖ్యలో డ్రోన్లను శత్రువుల మీదకు వదలవచ్చు. అందుకే ఇరాన్ తన 'షాహెద్-136' (ూష్ణుష్త్రవబ-136) సిరీస్ డ్రోన్లను, అలాగే 'తూఫాన్' రకాలను విరివిగా వాడుతోంది. వీటికి ఎదురుగా అమెరికా తన 'లూకాస్' డ్రోన్లతో పోటీకి దిగుతోంది.

**రాడార్లకు చిక్కని శత్రువు**

డ్రోన్ల వల్ల మరో పెద్ద లాభం ఏంటంటే, ఇవి చాలా చిన్నవిగా ఉండటం వల్ల శత్రు దేశాల రాడార్ వ్యవస్థలకు చిక్కడం చాలా కష్టం. పెద్ద యుద్ధ విమానాలను లేదా మిస్సైళ్లను గమనించినంత సులభంగా ఈ చిన్న డ్రోన్లను గుర్తించలేం. ఇవి నిశ్శబ్దంగా గాలిలో తేలుతూ వచ్చి, కచ్చితమైన లక్ష్యాలను దెబ్బతీస్తాయి. అందుకే చమురు క్షేత్రాలు, రక్షణ స్థావరాల మీద దాడులకు ఇవి 'బెస్ట్ ఆప్షన్'గా మారాయి. తాజాగా జరిగిన అరామ్‌కో ఆయిల్ రిఫైనరీ దాడి ఇందుకు ఒక నిదర్శనం. ఆ డ్రోన్ల దాడి వల్ల ప్రపంచ చమురు మార్కెట్ ఎంతగా వణికిపోయిందో మనం చూశాం.

**ఆత్మాహుతి డ్రోన్లు**

ఈ డ్రోన్లలో మరో రకం 'కామికేజ్' డ్రోన్లు. వీటిని 'ఆత్మాహుతి డ్రోన్లు' అని కూడా పిలుస్తారు. ఇవి లక్ష్యం వైపు దూసుకెళ్లి, బాంబులా పేలిపోతాయి. వీటిని తయారు చేయడం సులభం, ప్రయోగించడం ఇంకా సులభం. ఇరాన్ ఈ టెక్నాలజీలో చాలా ముందంజలో ఉంది. తక్కువ టెక్నాలజీతో ఎక్కువ నష్టాన్ని కలిగించడమే వీటి ఉద్దేశం. ఇప్పుడు ఇజ్రాయెల్ లాంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థ ఉన్న దేశం కూడా ఈ డ్రోన్ల దాడులను తట్టుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వస్తోంది.

**భవిష్యత్తు యుద్ధాలు ఇలాగే ఉంటాయా?**

నిజం చెప్పాలంటే, రాబోయే రోజుల్లో సైనికుల కంటే ఎక్కువగా ఇలాంటి రోబోటిక్ డ్రోన్లే యుద్ధ రంగంలో కనిపిస్తాయి. దీనివల్ల ప్రాణ నష్టం తగ్గుతుందని కొందరు అంటున్నా, యుద్ధాలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే ఆయుధాలు చౌకగా దొరికితే, చిన్న దేశాలు లేదా కొన్ని తీవ్రవాద ముఠాలు కూడా వీటిని వాడే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న ఈ డ్రోన్ల పోరాటం ప్రపంచ దేశాలకు ఒక కొత్త పాఠాన్ని నేర్పుతోంది. కేవలం ఖరీదైన రక్షణ వ్యవస్థలు ఉంటే సరిపోదు, ఇలాంటి చిన్న చిన్న డ్రోన్లను ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉండాలి.

టెక్నాలజీ పెరగడం వల్ల మానవాళికి ఎన్ని లాభాలు ఉన్నాయో, యుద్ధాల రూపంలో అన్ని నష్టాలు కూడా ఉన్నాయి. ఆకాశంలో విహరించే ఈ డ్రోన్లు శాంతి కోసం కాకుండా, వినాశనం కోసం వాడటం బాధాకరం. ఈ డ్రోన్ల యుద్ధం ఎక్కడికి దారితీస్తుందో, దీనివల్ల ఇంకా ఎంత నష్టం జరుగుతుందో అని ప్రపంచం ఆందోళన చెందుతోంది. ఏదేమైనా, ఒకప్పుడు మనం సినిమాల్లో చూసిన రోబోటిక్ యుద్ధాలు ఇప్పుడు మన కళ్లముందే నిజమవుతున్నాయి.

# ఇఫ్తార్ లో పాల్గొన్న కవిత



**సికింద్రాబాద్..: పెన్ పవర్:** మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవడం సంతోషకరమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. వారసిగూడలో జరిగిన ఇఫ్తార్ విందుకు జాగృతి అధ్యక్షురాలు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్లను ఇచ్చి ఉపవాస దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ అనేది పవిత్ర మాసమని ఈ మాసంలో చేసే ఉపవాస దీక్షలు గొప్పవని అన్నారు. గంగా జమున నదుల కలయిక లాగే హిందూ ముస్లింలు సోదర భావంతో ఇఫ్తార్ విందులకు హాజరు కావడం మంచి సాంప్రదాయమని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ విందు అనంతరం తెలంగాణ జాగృతి పార్టీలో పలువురు మైనార్టీలు కవిత సమక్షంలో చేరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పదవుల కోసం పైరవీలు చేయలేదు: రేవంత్ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి?



**హైదరాబాద్  పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని.. పైరవీలు కూడా చేయలేదని చెప్పారు. ప్రజల సమస్యలపై పోరాటాలు చేసి.. వారి మనసు గెలుచుకున్న తర్వాతే.. తనకు పదవులు వరించాయన్నారు. అయితే.. ఆయన ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్నది ఇప్పుడు పార్టీలో చర్చకు దారితీసింది. ఇటీవల కాలంలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీలో అసంతృప్తులపై తరచుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. వారిని నేరుగా పేరు పెట్టి అనకపోయినా.. సూటిగా వారికి తగిలేలా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని అనంతగి రిలో రెండు తెలుగు రాష్ట్రాల జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు గత మూడు రోజులుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా హాజరయ్యారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పదవులు వాటంతట అవే వరిస్తాయని.. తాను ఎక్కడా ఎవరినీ అడగలేదన్నారు. పదవుల కోసం పైరవీలు కూడా చేయలేదన్నారు. జెడ్పీటీసీ నుంచి సీఎం వరకు ఎదిగినా.. తాను ఎవరినీ ఇది కావాలి.. అని అడగకుండానే అన్నీ అందాయని చెప్పుకొచ్చారు.

**అదే తారకమంత్రం!**

రాహుల్ ప్రధాని కావడమే కాంగ్రెస్‌పార్టీ నాయకులకు తారకమంత్రం కావాలని సీఎంరేవంత్ రెడ్డి సూచించారు. అందరి ముందున్న ఏకైక లక్ష్యం రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమేనని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని పిలుపునిచ్చారు. --ఈ దేశం కోసం.. ఈ దేశ యువత కోసం.. రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన అవసరం ఉంది. ఆయన కోసం కాదు. ఇది మనందరి బాధ్యత. ఆదిశగా అందరూ కార్యాచరణకు శ్రీకారం చుట్టాలి-- అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇది కాంగ్రెస్ పార్టీతోపాటు దేశానికి కూడా అత్యంత ముఖ్యమని చెప్పారు.

అనవసరంగా వేధించారు!తనను అనవసరంగా వేధించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని, అయినా.. తాను ఎప్పుడూ వెన్ను చూపలేదన్నారు. జైల్లో పెట్టినా ప్రజల కోసం పనిచేశానన్నారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి సీఎం అయ్యా- అని వ్యాఖ్యానించారు. తనపై అనేక కేసులు పెట్టారన్న ఆయన.. ఇవన్నీ తేలిపోతాయన్నారు. సోనియాగాంధీ ఇవ్వడం వల్లే తెలంగాణ ఏర్పడిందన్న స్పృహ అందరికీ ఉండాలంటూ.. పరోక్షంగా బీఆర్ ఎస్ నాయకులపై వ్యాఖ్యానించారు. కాని.. కొందరు తమ సొంత ప్రయత్నం వల్లే వచ్చిందని చెప్పుకొంటున్నారని అన్నారు. కానీ.. సోనియా ఇవ్వకపోతే తెలంగాణ ఎక్కడిదని ప్రశ్నించారు.

# మార్చురీలో డెడ్ బాడీని కుక్క పీక్కుతినటమా రేవంత్?



**హైదరాబాద్  పెన్ పవర్:** ఈ ఉదంతం గురించి తెలిసిన తర్వాత జరిగింది నిర్లక్ష్యంతోనో.. అలక్ష్యంతోనో అన్న మాటలు చెప్పి సరిపెట్టుకోవటానికి వీల్లేదు. ఇంతకంటే దారుణ ఉదంతం మరొకటి ఉండదు. అరాచకానికి ప్రతిరూపంగా నిలిచే ఈ ఉదంతం గురించి తెలిసినంతనే షాక్ కు గురి కాక మానదు. అసలు ఇలా ఎలా జరుగుతుందన్న ప్రశ్న మదిలో మెదలటం ఖాయం. ప్రమాదవశాత్తు మరణించిన ఒక వ్యక్తిని.. పోస్టుమార్టం కోసం మార్చురీ గదిలో ఉంచితే.. ఒక కుక్క లోపలికి వెళ్లి.. ఒక డెడ్ బాడీని పీక్కుతున్న వైనం.. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. పొరపాటుగా జరిగినట్లుగా చెబుతున్నప్పటికి.. ఇందుకు కారణమైన వారిని క్షమించలేని పరిస్థితి. ఇంతకూ అసలేం జరిగిందంటే..జడ్చర్ల మండలం నాగసాల గ్రామానికి చెందిన 32 ఏళ్ల భీమేశ్వర్ ఇంటి నుంచి బహిర్భూమి కోసం బయటకు వెళ్లాడు. స్వతహాగా లారీ డ్రైవర్ కావటంతో.. మరేం ఫర్లేదు అనుకొని కుటుంబ సభ్యులు భావించారు. రాత్రి వరకు రాలేదు. తెల్లారిని అతడి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవటంతో.. చుట్టుపక్కల వెతికినా.. అతడి ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం స్థానిక చెరువులో శవంగా తేలాడు. ఎలా చనిపోయాడన్నది ఒక మిస్టరీ కాగా.. పోస్టుమార్టం కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలోకి తరలించారు.

మార్చురీ వద్ద సరైన భద్రత లేకపోవటంతో కుక్క లోపలకు చొరబడి శవాన్ని పీక్కుతింటూ కనిపించింది దీన్ని వీడియో చేసి.. సోషల్ మీడియాలో అప్ లోడ్ చేశారు. దీంతో.. ఈ వీడియో కాస్తా వైరల్ గా మారి.. తీవ్ర విమర్శలకు కారణమైంది. పోస్టుమార్టం సిబ్బంది గదిలోకి వెళుతుంటే.. కుక్క కూడా లోపలకు వెళ్లిందని.. అప్పుడే సిబ్బంది దాన్ని తరిమేసినట్లుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ చెబుతున్నప్పటికీ.. సిబ్బందితో పాటు వీధికుక్కలు మార్చురీ గదిలోకి వెళ్లే పరిస్థితి ఉందన్న విషయాన్ని ఆమె చెప్పకనే చెప్పినట్లైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ముప్పై పడకలతో ఉన్న జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలకు ఆధునీకరించారు. కొత్త ఆసుపత్రిలో మార్చురీని మాత్రం మార్చకుండా.. పాత ఆసుపత్రి భవనంలో కొనసాగిస్తున్నారు. అక్కడ సరైన భద్రతా కారణాలు లేని కారణంగా ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఏమైనా.. ఇలాంటి ఘటనలపై కఠినంగా స్పందించాల్సిన అవసరం ఉంది.

# పంచముఖి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

**సికింద్రాబాద్  పెన్ పవర్:** తెలంగాణలోని ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం మొండా మార్కెట్ పంచముఖి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభం నేపథ్యంలో ఆలయ చైర్మన్, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా వారికి వేదపండితులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే అన్ని ఆలయాలను కోట్ల రూపాయలతో అద్భుత క్షేత్రాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భక్తులు స్వచ్ఛందంగా విరాళాలతో పునర్నిర్మాణం చేసుకోవడం అభినందనీయమన్నారు. రాజకీయాలకతీతంగా భక్తులంతా కలసికట్టుగా ఆలయాన్ని పునర్నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో దేవాలయాలను అభివృద్ధి చేసే క్రమంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

# గ్రామపంచాయితీలకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఆదాయాలు

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:**
గ్రామ పంచాయితీల ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ , బీపీఎస్ పథకాల ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయితీలకు వాటా ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు 50 శాతం,, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం, ఏపీ టౌన్ ప్లానింగ్ విభాగానికి 20 శాతం నిధులు చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. ఈ కొత్త విధానంతో గ్రామ పంచాయితీలకు నిధుల కొరత తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలకు మంచి రోజులు రానున్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయితీలతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విధానం కింద గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాల కింద సమీకరించిన ఆదాయంలో సగం వాటాను పొందుతాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం ఆదాయాన్ని కేటాయిస్తారు. మిగిలిన 20 శాతం రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగానికి వెళ్తుంది. చాలా వరకూ గ్రామ పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఈ విధానం ప్రకారం వాటికి కావాల్సిన నిధులు అందజేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.స్థానిక సంస్థల సాధికారత విషయంలో ఏపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని ఈ నిర్ణయం తెలియజేస్తోందని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ విధానం ప్రకారం క్రమబద్ధీకరణ పథకాల ద్వారా సమీకరించిన నిధులను తిరిగి అదే ప్రాంత అభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీలకు సగం ఆదాయం కేటాయించడం ద్వారా, ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలైన పనులకు కూడా నిధులు లేక పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. అనేక గ్రామ పంచాయతీలు సాధారణ పారిశుద్ధ్య పనులను కూడా చేపట్టలేకపోతున్నాయి. ఎక్కువగా ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లపై ఆధారపడతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ూ=ూ, ధ్రూూ ఆదాయాలు స్థిరంగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. గ్రామ పంచాయతీలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. రెగ్యులరైజేషన్ పథకాల ద్వారా సేకరించిన నిధులను స్థానికంగానే ఖర్చు చేయనున్న నేపథ్యంలో ఎక్కువ మంది తమ ఆస్తుల రెగ్యులరైజేషన్ కోసం ముందుకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రేషన్ షాపులోకందిపప్పు, రాగులు లేనట్లే..

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి నెల ప్రారంభం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. అయితే విశాఖపట్నం, అల్లూరి జిల్లా రేషన్ కార్డుదారులకు మాత్రం ఈ నెలలో కందిపప్పుతో పాటుగా రాగులు పంపిణీ కూడా జరగడం లేదు. కందిపప్పు పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోగా.. గత మూడు నెలలుగా పంపిణీ చేసిన రాగులు కూడా విశాఖ, అల్లూరి జిల్లావాసులకు ఈసారికి అందుబాటులో లేకుండా పోయాయి.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. మార్చి ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యంతో పాటుగా అరకిలో పంచదార, కిలో గోధుమపిండి కూడా అందించనున్నారు. కొన్ని చోట్ల జొన్నలు, రాగుల పంపిణీ కూడా జరుగుతోంది. అయితే విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వంటి చోట్ల రాగుల పంపిణీ జరగడం లేదు. గత మూడు నెలలుగా రేషన్ కార్డుదారులకు రాగులను పంపిణీ చేశారు. అయితే మార్చి నెలలో మాత్రం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలిసిందిఅవసరాలకు తగిన మొత్తంలో రాగులు సరఫరా కాలేదని సమాచారం. ముఖ్యంగా ఒడిశా నుంచి రావాల్సిన రాగులు రాలేదని.. దీంతో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలలో రాగుల పంపిణీ జరగనట్లు సమాచారం. మరోవైపు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆదివారాలతో సహా రేషన్ షాపులు.. లబ్ధిదారులకు అందుబాటులో ఉండనున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, అలాగే సాయంత్రం



నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.మరోవైపు ఏపీలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నప్పటికీ.. కందిపప్పు సరఫరా మాత్రం జరగడం లేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీపై కందిపప్పు అందిస్తే మధ్యతరగతి జీవికి కాస్త ఊరటగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అయితే ఏపీలో కందిపప్పు పంపిణీ నిలిచిపోయి సుమారుగా ఏడాది కావొస్తోంది.బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.120 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు. రూ.67లకే అందించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా చేయాలని జనం కోరుతున్నారు. అయితే పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్ని నెలలు పాటు కందిపప్పు సరఫరా చేశారు. ఆ తర్వాత కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం ఊహాగానాలు



**విజయవాడ, మార్చి 3పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో నారా లోకేష్ సీఎం అనే చర్చ అప్పుడప్పుడూ తెరపైకివస్తోంది. ఇటీవలి కాలంలో లోకేష్ కు పట్టాభిషేకం చేస్తారన్న సోషల్ మీడియాలో తరచూ టాపిక్ వైరల్ అవుతోంది. నిజానికి లోకేష్ డిప్యూటీ సీఎం అనే ప్రచారం కొంత కాలం సాగింది. టీడీపీ నేతలు కూడా వరుసగా ప్రకటనలు చేశారు. కానీ ఇలాంటి ప్రకటనలు చేస్తే ఊరుకునేది లేదని హైకమాండ్ హెచ్చరించడంతో అందరూ సైలెంటు అయిపోయారు. కానీ ఇప్పుడు సీఎం చర్చ వస్తోంది. టీడీపీలో చంద్రబాబు తర్వాత లోకేష్ దే నాయకత్వం. చంద్రబాబు ఇప్పటికిప్పుడు వైదొలిగే అవకాశాలు లేవు. ఎందుకంటే చంద్రబాబుకు దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నాయి. గతంలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వినిపించింది. అప్పట్లో కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేసినప్పటికీ, పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని వారించడంతో ఆ చర్చ సద్దుమణిగింది. అయితే లోకేష్ సీఎం అనే చర్చ మళ్ళీ తెరపైకి రావడం వెనుక కేడర్‌లో ఉన్న ఉత్సాహమే ప్రధాన కారణం. యువగళం పాదయాత్ర ద్వారా తనను తాను నిరూపించుకున్న లోకేష్‌కు తగిన గుర్తింపు దక్కాలనేది అభిమానుల కోరిక. కానీ, పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా ఇలాంటి కీలక అంశాలపై అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానంలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అమరావతి నిర్మాణం. రాజధానిని ఒక కొలిక్కి తీసుకురావడమే తన జీవిత ఆశయమని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలన్నా మరో పదేళ్ల సుదీర్ఘ కాలం పడుతుందనేది వాస్తవం. ఇటువంటి క్లిష్ట సమయంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు పగ్గాలు వదిలిపెడతారనేది కేవలం ఊహ మాత్రమే. అమరావతి స్వప్నం సాకారం కాకుండా ఆయన సీఎం పీఠం నుంచి తప్పుకునే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారని, అక్కడ కీలక పదవి చేపట్టి రాష్ట్రంలో లోకేష్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే, చరిత్రను పరిశీలిస్తే చంద్రబాబు ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు. కింగ్ మేకర్‌గా తనకున్న లోక్ సభ ఎంపీల బలాన్ని ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించారు తప్ప, తన సొంత పదవుల కోసం వాడలేదు. 1990లలోనే ప్రధాని పదవినే కాదనుకున్న ఆయనకు, ఇప్పుడు కేంద్ర మంత్రి పదవులపై ఆసక్తి ఉంటుందనుకోవడం పొరపాటే అవుతుందని టీడీపీ వర్గాలంటున్నాయి నిజానికి టీడీపీలో చంద్రబాబు తర్వాత వారసుడిగా లోకేష్ నాయకత్వంపై ఎవరికీ సందేహాలు లేవు. కానీ అది ఎప్పుడు జరగాలి? ఎలా జరగాలి? అనేదానికి కాలమే సమాధానం చెబుతుంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గాసిప్స్ మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు పాలనపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది కాబట్టి, లోకేష్ పట్టాభిషేకం అనే అంశం ప్రస్తుతానికి కార్యరూపం దాల్చడం అసాధ్యమని టీడీపీ వర్గాలు క్లారిటీ ఇస్తున్నాయి.

# బెజవాడలో కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:** విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. ఈ మేరకు కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అయింది. హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారిలో విజయవాడ నగర పరిధిలో ఉన్నంత మేరకు.. ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే ప్రతిపాదనను సర్కార్ పరిశీలిస్తోంది. పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి మట్నదలుకొని మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలోని గంగూరు కూడలి వరకు మట్నత్తంగా 14 కి.మీ. మేర ఈ పైవంతెన నిర్మించాలని భావిస్తున్నారు. ఆరు వరుసలతో నిర్మించే ఫ్లై ఓవర్ కారణంగా హైవేలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలూ ఉండవని, విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడుతుందని అధికారులు యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఎలా చేపట్టవచ్చన్న భిన్న ప్రణాళికలపై ఢిల్లీ స్థాయిలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్చిస్తున్నారు.హైదరాబాద్- విజయవాడ-మచిలీపట్నం హైవే-65పై విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు మీదుగా ఈ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య ఎన్‌హెచ్-65ను నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రాజెక్ట్ చేపట్టారు. దీన్ని గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాలని ముందుగా భావించారు. ఆ తర్వాతా రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ దాకా విస్తరించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఒప్పుకుంది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ-మచిలీపట్నం హైవేను ఆరు వరుసలుగా విస్తరించే ప్రాజెక్ట్ కూడా చేపడుతున్నారు. విజయవాడ నగర పరిధిలో కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాతి నుంచి కృష్ణలంక, వారధి జంక్షన్, స్క్రూబ్రిడ్జి, బెంజ్ సర్కిల్, కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు మీదుగా దావులూరు టోల్‌ప్లాజా వరకు నాలుగు వరుసలుగానే ఈ రహదారి మిగిలిపోనుంది. వాహన రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ నగరం మధ్యలో నాలుగు వరుసలుగా మిగిలిపోతే ఎలాగన్న ప్రశ్న తలెత్తింది. దీనికి విజయవాడలో ఆరు వరుసలతో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించడమే పరిష్కారమన్న అంచనాకు అధికారులు వచ్చారు. తద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు ఆరు వరుసలతో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

# కూటమిలో మిత్రుల మధ్యే పోటీ

**ఏలూరు, మార్చి 3, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఈసారి పోరు అధికార, ప్రతిపక్షాల మధ్య కంటే.. అధికార కూటమిలోని పార్టీల మధ్యే ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ, ఈ ఎన్నికలను బహిష్కరించే యోచనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుపైనే పడింది. పైన నేతలు చేతులు కలిపినా, కింద కేడర్ మనసులు కలవడమే ఇప్పుడు అసలైన సవాల్‌గా మారింది.కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఈ సారి స్థానిక సంస్థల్లో సింహభాగం ఆశిస్తోంది. ఇటీవల రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి నేతలు కోనసీమ లాంటి ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో తామే పోటీ చేస్తామని బహిరంగంగా ప్రకటించడం కూటమిలో కలకలం రేపుతోంది. జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆ పార్టీ కేడర్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఫ్రెండ్లీ కాంటెస్ట్ పేరుతో అంతర్గత పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారుదశాబ్దాలుగా గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్న తెలుగుదేశం పార్టీకి, స్థానిక ఎన్నికలు చావో రేవో లాంటివి. తమ గ్రామంలో పట్టు కోల్పోవడానికి ఏ నాయకుడూ ఇష్టపడడు. సీట్ల సర్దుబాటులో భాగంగా తమకు పట్టున్న గ్రామాలను మిత్రపక్షాలకు కేటాయిస్తే, టీడీపీ కేడర్ తిరుగుబాటు చేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత క్షేత్రస్థాయిలో ఓటర్ల బదిలీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు ప్రశ్న.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కంటే బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకతను ప్రదర్శించాలని భావిస్తోంది. ఒకవేళ వైసీపీ బరిలో లేకపోతే, కూటమిలోని పార్టీలు ఒకరితో ఒకరు పోటీ పడటం ఖాయం. ప్రత్యర్థి లేని పోరాటంలో మిత్రపక్షాల మధ్య వైషమ్యాలు పెరిగి, అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఎమ్మెల్యేల స్థాయిలో కాకుండా, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారో వారికే కేటాయించడం. నియోజకవర్గ స్థాయిలోనే మూడు పార్టీల నేతలతో కమిటీలు వేసి వివాదాలు పరిష్కరించడం. స్థానిక సమస్యలపై కూటమి తరపున ఒకే అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయాల్సి ఉంది. కూటమి నాయకత్వం ఈ చిక్కుముళ్లను విడదీయకపోతే, స్థానిక ఎన్నికలు మిత్రపక్షాల మధ్య విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. అధికారాన్ని పంచుకోవడంలో చూపిన పరిణతిని, క్షేత్రస్థాయిలో సీట్ల పంపకంలో కూడా చూపిస్తేనే కూటమి ప్రయోగం విజయవంతమవుతుంది. లేనిపక్షంలో, ప్రత్యర్థి లేకపోయినా సొంత పార్టీల కుమ్ములాటలే కూటమికి అతిపెద్ద శత్రువులుగా మారతాయి.

# ఏపీ పేరు మార్పు రచ్చ...

**కాకినాడ, మార్చి 3, పెన్ పవర్:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రం పేరును మార్చిన సంగతి తెలిసిందే. అక్కడి ప్రజల కోరిక మేరకు కేరళం అని పేరు మార్చారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరును కూడా మార్చాలని డిమాండ్ మొదలైంది. గతంలో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించింది. తరువాత తెలుగు నాడుగా మార్చాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు కేరళ పేరు మార్పుతో తెలుగు నాడుగా ఏపీని మార్చాలన్న వాదన వినిపిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పేరు మార్పును ఊరుకోమని మరో వర్గం హెచ్చరిస్తోంది. అయితే తాజాగా ఈ తేనె తుట్టను కదిపారు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు. గతంలో ఎన్టీ రామారావు ఉమ్మడి ఏపీ ని తెలుగు నాడుగా మార్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ప్రముఖ ప్రవచన కర్తగా ఉన్నారు గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మికతతో పాటు చరిత్రను గుర్తుచేస్తూ ప్రవచనాలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో గతంలో ఏపీని తెలుగు నాడుగా మార్చేందుకు ఎన్టీఆర్ చేసిన ప్రయత్నాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు పదం కాదని.. ఆంధ్రప్రదేశ్ పేరులో తెలుగుదనం లేదు అని తేల్చేశారు. కేరళ వారికి ఉన్న పట్టుదల కూడా మనకు లేదని.. కేరళ ను కేరళంగా మార్చినట్టే.. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగు నాడుగా మార్చాలని గరికపాటి కోరారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరు మార్పు పై చర్చ మొదలైంది.

ఇదే అంశంపై భువనేశ్వరి పీఠాధిపతి స్వామి కమలానంద భారతి స్పందించారు. ఈ కొత్త చర్చ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే తెలుగు కాదా? రామాయణ కాలం నుంచి ఆంధ్రా అనే పదం ఉందంటూ ఆయన గరికపాటికి కౌంటర్ ఇచ్చారు. అడిగేవాళ్లు లేరని అధిక ప్రసంగాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా వింత పోకడలు, ఇంత ఆలోచనలు మంచిది కాదని.. తెలుగు నాడు అని మార్చినా ఎటువంటి సెంటిమెంటు ఉండదని.. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని విమర్శించారు. గరికపాటి తెలంగాణలో స్థిరపడ్డారని.. మా బ్రతుకులు ఎలా ఉండాలో మాకు తెలుసు అంటూ చురకలు అంటించారు. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలనే ఆలోచన ఇప్పటిది కాదు. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఆయన హయాంలోనే రాష్ట్రాన్ని తెలుగునాడుగా మార్చాలనే బలమైన ప్రతిపాదన వచ్చింది. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చలు జరిగాయి. కానీ అప్పట్లో రాజకీయ పరిణామాలు, రాజ్యాంగపరమైన ఇబ్బందుల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.ఇప్పుడు వీరి మధ్య జరిగిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి 1953లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అప్పట్లో దీనిని ఆంధ్ర అని మాత్రమే పిలిచేవారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలు కలిసిన తర్వాత, ఉమ్మడి రాష్ట్రానికి ఆంధ్రప్రదేశ్ అని పేరు పెట్టారు. అప్పుడే కొందరు మేధావులు తెలుగునాడు పేరును సూచించినా, ఆనాడు ఆంధ్ర అనే పదానికే మొగ్గు చూపారు. 1969లో మద్రాసు రాష్ట్రం తమిళనాడుగా మారింది. ఇటీవలే ఒరిస్సా ఒడిశాగా, పాండిచ్చేరి పుదుచ్చేరిగా మారాయి. ఇప్పుడు కేరళను కేరళంగా మార్చాలని ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ క్రమంలోనే గరికపాటి వంటి వారు తెలుగు అస్తిత్వం కోసం పేరు మార్పును సమర్థిస్తున్నారు.భాషా పరంగా ఆంధ్ర అనేది ఒక జాతిని సూచించే పదం కాగా, తెలుగు అనేది భాషను సూచిస్తుంది. గరికపాటి వాదన ప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రంలో భాష పేరు ఉండాలి. చారిత్రక పరంగా చూస్తే శాతవాహనులను ఆంధ్రులు అని పురాణాలు పేర్కొన్నాయి. దాదాపు 2000 ఏళ్ల చరిత్ర ఈ పదానికి ఉంది. అందుకే దీనిని మార్చడం అంటే చరిత్రను చెరపడమే అని కమలానంద భారతి వంటి పండితుల వాదన. ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరు మార్చాలంటే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. అనంతరం పార్లమెంటు ఆమోదంతో రాష్ట్రపతి సంతకం చేయాల్సి ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ పేరు మార్పు అనేది కేవలం భావోద్వేగపూరితమైన అంశం మాత్రమే కాదు, అది తెలుగు వారి అస్తిత్వానికి సంబంధించిన చర్చ. ఒకవైపు పురాణ కాలం నాటి ఆంధ్ర పదాన్ని గౌరవించే వారు, మరోవైపు భాషా గుర్తింపు కోసం తెలుగునాడు కావాలనే వారు -- ఈ ఇద్దరి మధ్య జరుగుతున్న ఈ పోరు ప్రస్తుతం ఏపీ రాజకీయ, సాంస్కృతిక వర్గాల్లో కాక రేపుతోంది. ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## యుద్ధం ఆరంభించడం మాత్రమే ట్రంప్ పని.. ముగించడం ఆయన చేతుల్లో లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోటి వెంట వచ్చే ప్రతి మాట అంతర్జాతీయ రాజకీయ యవనికపై ప్రకంపనలు సృష్టిస్తుంది. తాజాగా ఇరాన్‌ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు పశ్చిమాసియాను మరోసారి ఉద్రిక్తతల అంచున నిలబెట్టాయి. "ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగైదు వారాలు కొనసాగవచ్చు" అని ఆయన చేసిన ప్రకటన కేవలం ఒక అంచనా మాత్రమే కాదు.. రాబోయే భారీ సైనిక చర్యకు అది ఒక వ్యూహాత్మక సంకేతంగా కనిపిస్తోంది. అయితే చరిత్రను తిరగేస్తే యుద్ధాలను మొదలుపెట్టడం సులభమని.. కానీ వాటిని ముగించడం అత్యంత కఠినమైన పని అని అర్థమవుతుంది.

**వ్యూహాత్మక హెచ్చరిక: 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'**

ట్రంప్ తన ప్రసంగాల్లో ప్రస్తావించిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" అనే పదం ఇది ఒక తాత్కాలిక దాడి కాదని.. దీర్ఘకాలిక సైనిక వ్యూహమని స్పష్టం చేస్తోంది. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని చెప్పడం ద్వారా అమెరికా తన పాత 'కఠిన వైఖరి'ని మళ్ళీ తెరపైకి తెచ్చింది. ఇందులో ప్రధానంగా రెండు ఆందోళనలు కనిపిస్తున్నాయి..ఇరాన్ రహస్యంగా సాగిస్తున్నట్లు భావిస్తున్న అణ్వాయుధ తయారీని అడ్డుకోవడంతోపాటు అమెరికా భూభాగాన్ని తాకగల ఇరాన్ మిస్సైల్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**చరిత్ర నేర్పిన పాఠం: రష్యా-ఉక్రెయిన్ ఉదాహరణ**

యుద్ధ సమయాన్ని అంచనా వేయడంలో అగ్రరాజ్యాలు కూడా తడబడతాయని చరిత్ర నిరూపించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌పై దాడి చేసినప్పుడు కొన్ని రోజుల్లోనే కైవసం చేసుకుంటామని భావించారు. కానీ నేడు ఆ యుద్ధం నాలుగేళ్లు దాటినా ముగింపు దొరకడం లేదు. ఉక్రెయిన్ వంటి దేశమే రష్యాను ఇన్నేళ్లు నిలువరించగలిగితే భౌగోళికంగా క్లిష్టమైన, సైనిక పరంగా బలంగా ఉన్న ఇరాన్‌పై యుద్ధం కేవలం 4-5 వారాల్లో ముగుస్తుందనుకోవడం అతిశయోక్తే అవుతుంది.

**గల్ఫ్ దేశాల భవితవ్యం.. ఆర్థిక సంక్షోభం**

ఈ యుద్ధ జ్వాలలు కేవలం అమెరికా-ఇరాన్‌లకే పరిమితం కావు. యూఏఈ, ఖతార్, బహ్రెయిన్ వంటి గల్ఫ్ దేశాలు ఈ ఘర్షణల మధ్యలో నలిగిపోయే ప్రమాదం ఉంది. గల్ఫ్ ప్రాంతంలో అస్థిరత ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల ఇంధన ధరలు ఆకాశాన్ని తాకి భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం అవుతాయి. రష్యాపై విధించిన ఆంక్షల వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత దెబ్బతిన్నదో మనకు తెలుసు. ఇరాన్ విషయంలోనూ అదే జరిగితే అది ప్రపంచ వాణిజ్య రంగాన్ని కుదిపేస్తుంది.

**రాజకీయ జూదం**

ట్రంప్ ఈ యుద్ధ నినాదాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. తనను తాను ఒక 'శక్తివంతమైన నాయకుడిగా' ప్రక్షేపించుకోవాలనే ప్రయత్నం ఇందులో కనిపిస్తోంది. అయితే యుద్ధం గనుక అంచనాలు తప్పి సుదీర్ఘంగా సాగితే అది ఆయనకు రాజకీయంగా పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. "కత్తి పట్టిన వాడు గాయం తప్పించుకోలేడు" అన్న సామెత ఇక్కడ అక్షర సత్యం. యుద్ధం అనేది ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదు. పశ్చిమాసియా అగ్నిగుండంగా మారితే దాని ప్రభావం ప్రతి దేశంపై పడుతుంది. ట్రంప్ అంచనాలు నిజమై ఈ వివాదం త్వరగా ముగుస్తుందా లేక ప్రపంచం మరో దీర్ఘకాలిక యుద్ధంలోకి కూరుకుపోతుందా అనేది కాలమే నిర్ణయించాలి. శాంతియుత చర్చల ద్వారా పరిష్కారం వెతకడమే ప్రస్తుత ప్రపంచానికి క్షేమకరం.

## అమెరికా కంటే ఇండియాలోనే వైద్యం బెస్ట్.. ఒక విశ్రాంత ఉద్యోగి అనుభవం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** మన దేశంలో చిన్న ఒళ్లు నొప్పులు వచ్చినా, లేక ఏదైనా జ్వరం వచ్చినా వెంటనే పక్కింటి డాక్టరు దగ్గరికో, లేదా మెడికల్ షాపుకో వెళ్లి మందులు తెచ్చుకోవడం మనకు అలవాటు. కానీ, అమెరికా లాంటి అగ్రరాజ్యంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో వాషింగ్టన్ స్టేట్ లోని సియాటెల్ నగరంలో ఉంటున్న ఒక సీనియర్ సిటిజన్ వివరిస్తుంటే నిజంగా ఆశ్చర్యం వేస్తోంది. ఆయన తన భార్య అనారోగ్యం నిమిత్తం అక్కడ పడ్డ కష్టాలు చూస్తుంటే, "మన భారతదేశమే మనకు మేలు" అని అనక మానరు.

**చిన్న సమస్యకు పెద్ద ప్రహసనం!**

ఆయన భార్యకు శ్వాసకోస సంబంధిత సమస్య ఉంది. ఇండియా నుంచి తెచ్చుకున్న మందులు అయిపోవడంతో, ముందు జాగ్రత్తగా ఒక స్పెషలిస్ట్ డాక్టరును కలవాలని వారు అనుకున్నారు. కానీ అక్కడే అసలు కథ మొదలైంది. మన దగ్గర నేరుగా పెద్ద డాక్టరు దగ్గరికి వెళ్లినట్టు అక్కడ కుదరదు. ముందుగా ఒక జనరల్ ఫిజీషియన్‌ను కలవాలట. దానికి కూడా వారం రోజుల తర్వాత అపాయింట్‌మెంట్ ఇచ్చారు. అది కూడా నేరుగా కాదు, కేవలం వీడియో కాల్ ద్వారా మాత్రమే! కేవలం పది నిమిషాల ఫోన్ కాల్ కోసం వారు వారం రోజులు వేచి చూడాల్సి వచ్చింది.


**ధరలు వింటే గుండె ఆగిపోవాల్సిందే!**

అత్యంత విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ పది నిమిషాల వీడియో కాల్ కన్సల్టేషన్ ఫీజు అక్షరాలా వి283 (సుమారు ?23,000). కేవలం ఫోన్లో మాట్లాడినందుకు ఇంత వసూలు చేయడం మన వాళ్లకు ఊహకందని విషయం. ఇక మందుల విషయానికి వస్తే అది మరో పెద్ద షాక్. డాక్టర్ రాసిచ్చిన మందుల కోసం స్టోర్‌కు వెళ్తే, అవి రావడానికి మరో ఐదు రోజులు పడుతుందన్నారు. సరే అని ఐదో రోజు వెళ్లి చూస్తే.. ఆ మందుల ప్యాకెట్ మీద 'మేడ్ ఇన్ ఇండియా - సిప్లా' అని రాసి ఉందట! మరి ఆ మందుల ధర ఎంతో తెలుసా? ఇండియాలో కేవలం ?2,500 ఉండే ఆ మందులకు అమెరికాలో అక్షరాలా ?42,000 వసూలు చేశారు. ఇన్సూరెన్స్ ఉంది కాబట్టి సగం రాయితీ పోగా, వారు ?21,000 చెల్లించాల్సి వచ్చింది. అంటే మన దేశంలో దొరికే సాదాసీదా మందులను అక్కడ పొందడానికి 12 రోజుల సమయం, వేలల్లో ఖర్చు చేయాల్సి వచ్చిందన్నమాట.

**మన దేశమే నూటికి నూరుపాళ్లు మేలు!**

ఈ అనుభవం విన్న తర్వాత ఎవరికైనా ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది.. మన దేశంలో వైద్య సదుపాయాలు చాలా సులభంగా, చౌకగా అందుబాటులో ఉన్నాయి. అర్ధరాత్రి మనకు ఏదైనా సమస్య వచ్చినా, వెంటనే పక్కనే ఉన్న హాస్పిటల్‌కు వెళ్లి డాక్టరును కలవగలం. మందుల షాపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. కానీ అమెరికాలో డబ్బులు ఉన్నా సరే, సరైన సమయంలో వైద్యం అందడం అనేది ఒక పెద్ద సవాలుగా మారింది. ఆ సీనియర్ సిటిజన్ చెప్పినట్లుగా, విశ్రాంత జీవితంలో మన దేశంలో ఉండటమే ఒక అదృష్టం. భారతదేశంలో వైద్యం అధ్వాన్నంగా ఉందని విమర్శించే వారికి ఇది ఒక గట్టి సమాధానం. ఇక్కడ కేవలం వందల రూపాయల్లో అయిపోయే పనికి, అక్కడ లక్షలు పోయాల్సి వస్తోంది. మన పుణ్యభూమి అయిన భారతదేశంలో మనం ఇంత ప్రశాంతంగా, సులభంగా బతుకుతున్నందుకు గర్వపడాలి.డబ్బు సంపాదించడానికి అమెరికా వెళ్లడం మంచిదే కావచ్చు, కానీ ఆరోగ్యం విషయంలో మాత్రం మన దేశాన్ని మించిన ప్రదేశం లేదనిపిస్తుంది. సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండే వైద్యం, మన మందుల తయారీ కంపెనీల గొప్పతనం ఈ సంఘటన ద్వారా మరోసారి నిరూపితమయ్యాయి. విదేశాల్లో ఉంటున్న మన మిత్రులు ఈ విషయాలను గమనించి జాగ్రత్తగా ఉండాలని కోరుకుందాం. మన దేశంలో మనం క్షేమంగా ఉన్నందుకు సంతోషిద్దాం!

# మయామి రియల్ ఎస్టేట్ షేక్.. రికార్డు ధరతో విలాసవంతమైన విల్లా కొన్న జుకర్‌బర్గ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అంటే తెలియని వారు వుండరు. ఆయన చేసే ప్రతిది ఓ సంచలనం. ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్‌లో ఉండే ఈయన, తాజాగా మయామిలో కొన్న ఓ ఖరీదైన ఇల్లు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సుమారు 170 మిలియన్ డాలర్ల అంటే దాదాపు 1400 కోట్ల రూపాయలకు పై మాటే,ఈ భారీ ధరతో కొన్న ఈ భవనం సరికొత్త రికార్డులను సృష్టించింది. బిలియనీర్ల బంకర్ అని పిలిచే ఒక ప్రైవేట్ ద్వీపంలో ఉన్న ఈ లగ్జరీ హౌస్ ప్రత్యేకతలు ఇప్పుడు చూద్దాం..

**జుకర్‌బర్గ్ కొత్త చిరునామా:**

మార్క్ జుకర్‌బర్గ్, తన భార్య ప్రిసిల్లా చాన్‌తో కలిసి మయామిలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఇండియన్ క్రీక్ ఐలాండ్'లో ఒక భారీ భవనాన్ని తన సొంతం చేసుకున్నారు. ఇక 170 మిలియన్ డాలర్లతో జరిగిన ఈ డీల్, మయామి చరిత్రలోనే అత్యంత ఖరీదైన అమ్మకంగా రికార్డు సృష్టించింది. ఇక అంతకుముందు 120 మిలియన్ డాలర్లుగా ఉన్న రికార్డును జుకర్‌బర్గ్ ఒక్కసారిగా చెరిపివేశారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ ఆరోన్ రోలిన్స్ నుండి ఈ ఎస్టేట్‌ను ఆయన కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భవనం నిర్మాణం సగం పూర్తయింది, దీనిని జుకర్‌బర్గ్ తన అభిరుచికి తగ్గట్టుగా మరింత విలాసవంతంగా తీర్చిదిద్దే ప్రయత్నం లో వున్నారు.

**బిలియనీర్ల బంకర్.. ఇక్కడ అంతా స్పెషలే:**

ఈ ఇల్లు ఉన్న 'ఇండియన్ క్రీక్ ఐలాండ్' సామాన్యమైన ప్రదేశం కాదు. ప్రపంచవ్యాప్తంగా దీనిని "బిలియనీర్ బంకర్" అని పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడికి వెళ్లడం అందరికీ సాధ్యం కాదు. పరిమితమైన రోడ్లు, ప్రైవేట్ గోల్ఫ్ కోర్ట్, కంట్రీ క్లబ్ వంటి సౌకర్యాలతో పాటు భారీ భద్రత ఈ ఐలాండ్ సొంతం. ఇప్పటికే ఇక్కడ ఇవాంకా ట్రంప్, జారెడ్ కుష్నర్, టామ్ బ్రాడీ వంటి దిగ్గజాలు నివసిస్తున్నారు. కాలిఫోర్నియాలో బిలియనీర్లపై పన్నులు పెంచే అవకాశం వున్నందున జుకర్‌బర్గ్ వంటి టెక్ మొగుల్స్ ఇప్పుడు ట్యాక్స్ తక్కువగా ఉండే ఫ్లోరిడా వైపు చూస్తున్నారు. అందుకే మయామి రియల్ ఎస్టేట్ ఇప్పుడు బిలియనీర్ల అడ్డాగా మారిపోయింది.

**టెక్ దిగ్గజాల చూపు ఇటు వైపే:**

జుకర్‌బర్గ్ ఒక్కరే కాదు, ఇంకా ఎందరో ఈ జాబితాలో వున్నారు వారిలో గూగుల్ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ కూడా మయామిలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. లారీ పేజ్ ఇప్పటికే 188 మిలియన్ డాలర్లు ఖర్చు చేసి మూడు ప్రాపర్టీలు కొనగా, సెర్గీ బ్రిన్ కూడా 50 మిలియన్ డాలర్ల ఇంటిని తీసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. అయితే, జుకర్‌బర్గ్ ఈ మయామి భవనాన్ని తన ప్రధాన నివాసంగా వాడుతారా లేక తన రియల్ ఎస్టేట్ కోసం మరో ఆస్తిగా ఉంచుతారా అన్నది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. ఇప్పటికే ఆయనకుఅనేక చోట్ల పాలో ఆల్టో, లేక్ తాహో, వాషింగ్టన్ డిసి, హవాయిలో వేల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి.

# వైద్య వృత్తి.. వద్దు బాబోయ్.. అసలు కారణాలు తెలిస్తే షాక్!


**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు 'వైద్యో నారాయణో హరిః' అంటూ దైవంతో సమానంగా పూజలందుకున్న డాక్టర్లే ఇప్పుడు తమ వృత్తి వద్దని ఆవేదన చెందుతున్నారు. తాజాగా జరిగిన ఓ సర్వేలో 91 శాతం మంది వైద్యులు తమ పిల్లలు ఈ రంగానికి రావద్దని కోరుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విపరీతమైన పని ఒత్తిడి, రోగుల బంధువుల దాడులు, ఆర్థిక అనిశ్చితి మధ్య నలుగుతున్న ప్రాణదాతల నిజ జీవిత గాథలు వింటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే..

**చదువుకే సగం జీవితం.. సెటిల్ అయ్యేది ఎప్పుడు:**

సాధారణంగా ఏ వృత్తిలోనైనా 25 ఏళ్ల వయసుకే స్థిరపడి సంపాదన మొదలుపెడతారు. కానీ, ఒక డాక్టర్ పూర్తిస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలంటే ఎంబీబీఎస్, పీజీ అంటూ కనీసం 35 ఏళ్లు వచ్చే వరకు పుస్తకాలతోనే యుద్ధం చేయాలి. ఇక తోటి స్నేహితులు సాఫ్ట్‌వేర్ రంగంలో లక్షల జీతాలు తీసుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేస్తుంటే, వైద్యులు మాత్రం తెల్లవార్లు హాస్పిటల్ వార్డుల్లో, ప్రాక్టికల్స్ మధ్య కాలం గడిపేస్తున్నారు. ఇక ఈ సుదీర్ఘమైన నిరీక్షణ వారిలో తీవ్రమైన మానసిక వేదన, మెంటల్ టార్చర్ మిగులుస్తోంది. జీవితంలో సగం కాలం కేవలం చదువుకే కేటాయించడం వల్ల వ్యక్తిగత సుఖాలకు, కుటుంబానికి దూరమవుతున్నామని ఎక్కువ మంది డాక్టర్లు వాపోతున్నారు.

**కోట్లలో ఫీజులు.. అప్పుల ఊబిలో కెరీర్:**

వైద్య విద్య ఇప్పుడు సామాన్యులకు అందని ద్రాక్షలా మారింది. ముఖ్యంగా మధ్యతరగతి విద్యార్థులు పీజీ సీటు కోసం ప్రైవేట్ కాలేజీల్లో కోట్లకు పైగా ఫీజులు కట్టాల్సి రావడం పెను భారంగా మారింది. ఇక బ్యాంక్ లోన్లు తీసుకుని చదివిన వారు కెరీర్ ప్రారంభంలోనే అప్పుల టెన్షన్ అనుభవిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి, ఇన్నేళ్లు కష్టపడినా చివరకు వచ్చే జీతం లేదా ప్రాక్టీస్ ద్వారా వచ్చే ఆదాయం పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం పొంతన ఉండటం లేదు.



దీనికి తోడు 67 శాతం మంది డాక్టర్లు మెడికో లీగల్ కేసుల భయంతో నిరంతరం ఒత్తిడికి లోనవుతూ, మానసిక ప్రశాంతతను పూర్తిగా కోల్పోతున్నారు.

**ప్రాణదాతలపై దాడులు.. భయం నీడలో విధులు:**

సేవ చేయాలనే తపనతో ఆస్పత్రికి వెళ్లే వైద్యులకు ఇప్పుడు భద్రత కరువైంది. సర్వేలో తేలిన షాకింగ్ విషయం ఏమిటంటే, సుమారు 84 శాతం మంది డాక్టర్లు రోగుల బంధువుల చేతిలో అవమానాలు ఎదురవుతాయనే భయంతోనే డ్యూటీ చేస్తున్నారు. చిన్న పొరపాటు జరిగినా లేదా రోగి పరిస్థితి విషమించినా వెంటనే డాక్టర్లపై దాడులు చేయడం, ఆస్పత్రులను ధ్వంసం చేయడం కామన్ గా మారింది. అహోరాత్రులు శ్రమించినా దక్కేది అవమానాలేనని వారు ఆవేదన చెందుతున్నారు. అందుకే, ఇంతటి రిస్క్ ఉన్న వృత్తిలోకి తమ పిల్లలను పంపి వారి ప్రాణాలను ప్రమాదంలో పడేయలేమని వైద్యులే తెగేసి చెబుతున్నారు.

# తమిళ రాజకీయాల్లో జగన్.. ఆ సాహసం చేయగలరా?



**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో ఎన్నికలు జరగనున్న తమిళనాడులో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వ్యవహారశైలి హాట్ టాపిక్ అవుతోంది. గత నెలలో చెన్నైలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన మాజీ సీఎం జగన్ దక్షిణాది రాజకీయ వర్గాలను ఆకర్షించారు. తమిళనాడుకు చెందిన దిగ్గజ నాయకులు, సెలబ్రెటీలతో జగన్ ఆ సందర్భంలో కలిసిన ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అదేసమయంలో తమిళనాడు సీఎం స్టాలిన్ తో జగన్ కు ఉన్న సంబంధాలపై విస్తృత చర్చ జరిగింది. తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో జగన్ రెడ్డి సామాజికవర్గాన్ని ఆకర్షించేందుకు స్టాలిన్ ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో స్టాలిన్ పుట్టిన రోజు వేడుకలకు వైసీపీ మాజీ మంత్రి రోజా హాజరుకావడం పలు ఊహాగానాలకు తెరలేపిందని అంటున్నారు.తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టినరోజు వేడుకలు ఈ నెల 1న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ మహిళా నేత ఆర్ కే రోజా హాజరుకావడం తెలుగు రాష్ట్రాల రాజకీయాలను ఆకర్షించింది. ముఖ్యంగా ఏపీలో ఈ అంశంపై హాట్ డిబేట్ జరుగుతోంది. సినీ నటిగా రోజాకు తమిళనాడులో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. అంతేకాకుండా ఆమె మెట్టినిల్లు తమిళనాడు. రోజా భర్త సెల్వమణి సొంత ప్రాంతం తమిళనాడు. దీంతో రోజా డీఎంకే కార్యక్రమానికి హాజరుకావడంపై పెద్ద చర్చ జరుగుతోంది. తమిళనాడు ఎన్నికల్లో రోజా డీఎంకే అనుకూలంగా ప్రచారం చేస్తారని ఓ వర్గం మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలను రోజా ఖండిస్తున్నారు. తన పర్యటన పూర్తి వ్యక్తిగతమని, తమిళ రాజకీయాలతో తనకు పనిలేదని చెబుతున్నారు.స్టాలిన్ పుట్టినరోజు వేడుకలకు రోజా వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులో రాజకీయం ఏదీ లేదని ఆమె చెబుతున్నప్పటికీ, ఆ పార్టీ అధినేత జగన్ వ్యూహం ఏమిటి అన్న ప్రశ్న ఎక్కువగా వినిపిస్తోంది. గత నెలలో వైఎస్ ఇంట పెళ్లి వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హాజరయ్యారు. జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు సైతం స్టాలిన్ వచ్చారు. అంతేకాకుండా ఇద్దరి మధ్య వ్యాపార సంబంధాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో తమిళనాడు ఎన్నికలలో స్టాలిన్ కు జగన్ మద్దతు ప్రకటిస్తారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం తమిళనాడులో త్రిముఖ పోటీ నెలకొంది. డీఎంకే ఆధ్వర్యంలో ఒక కూటమి, అన్నాడీఎంకే ఆధ్వర్యంలో బీజేపీ కూటమి హోరాహోరీగా తలపడుతున్నాయి. ఇదే సమయంలో సినీ నటుడు విజయ్ కూడా తన పార్టీ టీవీకేను రేసులో తొలివరుసకు తీసుకువచ్చారని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఏపీ సరిహద్దుల్లో ఉన్న తమిళ ప్రాంతంలో వైసీపీ ప్రభావం ఉంటుందనే అంచనాతో డీఎంకే అధినేత స్టాలిన్ పావులు కదుపుతున్నారని అంటున్నారు.వైసీపీ నాయకత్వంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయనే సంకేతాలు ఇవ్వడం ద్వారా ఏపీ-తమిళనాడు సరిహద్దుల్లో ఓటు బ్యాంకును పదిలం చేసుకోవడం, జగన్ రెడ్డికి మద్దతుగా నిలిచే సామాజికవర్గాలను ఆకర్షించాలని చూస్తున్నారని అంటున్నారు. అయితే స్టాలిన్ ప్రయత్నాలకు జగన్ రెడ్డి ఎంతవరకు సానుకూలంగా వ్యవహరిస్తారనేది ఆసక్తి రేపుతోంది. తమిళనాడులో సీఎం స్టాలిన్ కు జగన్ దగ్గరైతే కేంద్రంలోని అధికార బీజేపీ ఆగ్రహానికి గురికావాల్సివస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీకి కోపం తెప్పించే పనిని జగన్ రెడ్డి చేస్తారా? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా చెబుతున్నారు. బీజేపీతో తొలి నుంచి సామరస్యంగా వ్యవహరిస్తున్న మాజీ సీఎం జగన్.. తమిళ ఎన్నికల కోసం బీజేపీతో సంబంధాలను దూరం చేసుకుంటారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి మాజీ మంత్రి రోజా చెన్నై పర్యటన రాజకీయంగా పెద్ద చర్చకు తెరలేపినట్లైందని అంటున్నారు.

# రూ.3 కోట్లు ఇస్తాం.. మమ్మల్ని గల్ఫ్ నుంచి తీసుకెళ్లండి: ప్రైవేట్ జెట్లకు డబ్బున్నోళ్ల ఆఫర్స్




గల్ఫ్ తీరంలో ఇరాన్ క్షిపణులు గర్జిస్తున్నాయి.. డ్రోన్లు ఆకాశాన్ని కమ్మేస్తున్నాయి.. సాధారణ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దిక్కుతోచని స్థితిలో ఉంటే.. కోటీశ్వరుల పరిస్థితి మాత్రం మరోలా ఉంది. పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్న వేళ.. దుబాయ్, అబుదాబి వంటి విలాసవంతమైన నగరాల్లో నివసించే 'అల్ట్రా రిచ్' ప్రాణాలు కాపాడుకోవడానికి కోట్లు కుమ్మరిస్తున్నారు. కేవలం ఒక్క రోజులో ఈ ప్రాంతం నుంచి సురక్షితంగా బయటపడేందుకు ప్రైవేట్ జెట్ బ్రోకర్లకు 3లక్షల 50వేల డాలర్లు అంటే మన కరెన్సీలో సుమారు రూ. 3కోట్ల 20లక్షలు చెల్లించేందుకు కూడా వెనుకాడటం లేదని సమాచారం.ఇరాన్ చేపట్టిన డ్రోన్, క్షిపణి దాడులతో దుబాయ్ ఆకాశం పొగతో నిండిపోయింది. పేలుళ్లు, ఇంటర్సెప్షన్ల ధాటికి విలాసవంతమైన 'ఫేర్‌మాంట్ ది పామ్' వంటి హోటళ్ల సమీపంలో శిథిలాలు పడి మంటలు చెలరేగడంతో సంపన్నుల్లో వణుకు మొదలైంది. ఇప్పటికే దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం పాక్షికంగా దెబ్బతినడం, విమాన రాకపోకలు నిలిచిపోవడంతో.. కమర్షియల్ ఫ్లైట్స్ కోసం వేచి చూడకుండా సొంతంగా రూట్లు వెతుక్కుంటున్నారు సంపన్నులు. ప్రైవేట్ సెక్యూరిటీ కంపెనీలకు ఫోన్ల మీద ఫోన్లు చేస్తూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ తమను యూరోప్‌కు చేర్చాలని వేడుకుంటున్నారంట.

పస్తుతానికి సౌదీ అరేబియా ఒక్కటే సురక్షితమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. అందుకే దుబాయ్ నుంచి 10 గంటల పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించి సౌదీకి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో లండన్, పారిస్ వంటి నగరాలకు చెక్కేస్తున్నారంట ఈ అల్ట్రా రిచ్. విమానాల లభ్యత తక్కువగా ఉండటం, డిమాండ్ విపరీతంగా పెరగడంతో చార్టర్ ఫ్లైట్ రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఒక్కో విమానానికి మూడు కోట్లకు పైగా వసూలు చేస్తున్నా.. ప్రాణ రక్షణ కోసం కార్పొరేట్ దిగ్గజాలు, సంపన్న కుటుంబాలు అడిగినంత డబ్బు క్షణాల్లో పే చేస్తున్నారు.

యుద్ధం అంటే సామాన్యుడికి చావు భయం.. కానీ ఈ ధనవంతులకు అది తమ విలాసవంతమైన జీవితాన్ని కాపాడుకునే ఖరీదైన పోరాటంలా మారిందని నెటిజన్లు దీనిపై స్పందిస్తున్నారు. క్షిపణుల హోరులో కూడా తమ ప్రైవేట్ సెక్యూరిటీ బలగాల రక్షణలో సరిహద్దులు దాటుతున్న ఈ అల్ట్రా రిచ్ క్లాస్ తీరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. దుబాయ్ స్కైలైన్ మీద పొగ మేఘాలు కమ్ముకుంటుంటే.. రన్‌వేల మీద నుంచి కోటీశ్వరుల జెట్లు రయ్‌మని దూసుకుపోవటం డబ్బుకు ఉన్న పవర్ ఏంటో చూపిస్తోంది యుద్ధ భూమిలో.

# ఖమేనీ మృతిపై భారత్ మౌనం.. దౌత్య వ్యూహమా? అనివార్యమా?

- ఖమేనీ మృతికి అధికారికంగా సంతాపం తెలపని భారత ప్రభుత్వం
- గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌తో సంబంధాలే కారణమన్న విశ్లేషకులు
- కేంద్రం తీరుపై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల విమర్శలు



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ పరిణామంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ, అక్కడి పరిస్థితులు "తీవ్ర ఆందోళనకరం" అని మాత్రమే వ్యాఖ్యానించారు. అయితే, ఖమేనీ మృతికి అధికారికంగా సంతాపం ప్రకటించకపోవడం దౌత్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇరాన్ అధ్యక్షుడి మృతికి జాతీయ సంతాప దినం ప్రకటించిన భారత్, ఇప్పుడు సుప్రీం లీడర్ విషయంలో మౌనం పాటించడం ఈ చర్చకు మరింత బలాన్నిస్తోంది.భారత్ ఈ వైఖరి తీసుకోవడం వెనుక బలమైన దౌత్య కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉన్న బలమైన వ్యూహాత్మక సంబంధాలు, అలాగే యూఏఈ, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ మిత్రదేశాలతో స్నేహాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. యూఏఈపై జరిగిన దాడులను ప్రధాని మోదీ గతంలోనే తీవ్రంగా ఖండించారు. దీనికి తోడు, కశ్మీర్‌పై గతంలో ఖమేనీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కూడా ఈ కఠిన వైఖరికి ఒక కారణంగా చెబుతున్నారు.భారత ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కేంద్రం తీరును తప్పుబట్టాయి. ఇది భారత నైతిక నాయకత్వానికి దెబ్బ అని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించగా, ఒక సార్వభౌమ దేశాధినేతను హత్య చేయడాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు.ప్రస్తుతానికి 'వేచి చూసే' ధోరణిని అవలంబిస్తున్నట్లు కేంద్రం సంకేతాలిస్తోంది. పశ్చిమాసియాలో నివసిస్తున్న సుమారు 90 లక్షల మంది భారతీయుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అందువల్ల ఏ పక్షానికీ మద్దతు ప్రకటించకుండా, కేవలం శాంతియుత చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని భారత్ సూచిస్తోంది.


# మహిళా మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల కొత్త వ్యూహం.. ఆ ఫండ్స్‌లోనే పెట్టుబడి




భారతీయ ఆర్థిక వ్యవస్థలో మహిళలు ఇప్పుడు జస్ట్ సేవింగ్స్ చేసేవారిగా మాత్రమే కాకుండా.. వ్యూహాత్మక ఇన్వెస్టర్లుగా కూడా ఎదుగుతున్నారు. ఒకప్పుడు బంగారానికో, పోస్టాఫీసు పొదుపు పథకాలకో పరిమితమైన మహిళలు.. ఇప్పుడు స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకుంటూ మ్యూచువల్ ఫండ్స్ వైపు అడుగులు వేస్తున్నారు. దేశంలోని మొత్తం 5.34 కోట్ల మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లలో మహిళల వాటా సుమారు 1.38 కోట్లకు చేరిందని ది వెల్త్ కంపెనీ డేటా ప్రకారం వెల్లడైంది. అంటే దాదాపు 26 శాతం మంది మహిళలు ఆర్థిక నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా టైర్-2 సిటీలతో పాటు అభివృద్ధి చెందుతున్న నగరాల్లోని మహిళలు కూడా ఇప్పుడు ఇన్వెస్ట్‌మెంట్ బాట పడుతున్నారు. మహిళా ఇన్వెస్టర్ల పెట్టుబడి శైలిని గమనిస్తే.. వారు క్రమశిక్షణకు పెద్దపీట వేస్తున్నారు. సుమారు 56 శాతం మంది మహిళలు తమ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌ను అగ్రస్థానంలో ఉంచారు. వీరు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(రాxరా) మార్గంలోనే తమ పెట్టుబడులు పెడుతున్నారు ఎక్కువగా. నెలకు కొంత మొత్తాన్ని క్రమం తప్పకుండా పెట్టుబడుల కోసం కేటాయించడం ద్వారా దీర్ఘకాలిక లక్ష్యాలను చేరుకోవచ్చనే నమ్మకం వారిలో పెరిగింది. అయితే పెట్టుబడి ప్రారంభించని వారిలో అధిక శాతం మంది తమ ఆదాయంలో 10 శాతం కంటే తక్కువ మాత్రమే పొదుపు చేస్తున్నారట. సరైన అవగాహన కల్పిస్తే ఈ వర్గం కూడా పెద్ద ఎత్తున మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది.

ఏఏ వయస్సు మహిళలు ఎలాంటి ఫండ్స్ ఎంచుకుంటున్నారనే వివరాలను పరిశీలిస్తే.. ముందుగా 18 నుండి 35 ఏళ్ల మధ్య ఉన్న యువతులు 'గ్రోత్ ఓరియెంటెడ్' ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని తేలింది. వీరు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడటం లేదట. ఇక 35 నుండి 50 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు తమ పిల్లల చదువులు, పెళ్లిళ్లు, సొంత ఇంటి కలల కోసం బ్యాలెన్స్‌డ్ ఫండ్స్ లేదా హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంచుకుంటున్నారని డేటా చెబుతోంది. 50 ఏళ్లు పైబడిన వారు మాత్రం పెట్టుబడి అసలుకు సేఫ్టీ ఉండేలా డెట్ ఫండ్స్ లేదా తక్కువ రిస్క్ ఉండే లార్జ్ క్యాప్ ఫండ్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే 57 శాతం మంది మహిళలు తమకు ఫైనాన్షియల్ అడ్వైజర్ల నుంచి మరింత స్పష్టమైన సలహాలు కావాలని కోరుకుంటున్నారట.ప్రస్తుతం భారత మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ రూ.81లక్షల 90వేల కోట్ల మార్కును అందుకుంది. ఈ వృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమైనది. అయినప్పటికీ 46 శాతం మంది నాన్-ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్ల గురించి మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు. కాంప్లెక్స్ విశ్లేషణల కంటే.. సులభంగా అర్థమయ్యే ఇన్వెస్ట్‌మెంట్ బాస్కెట్స్, ట్రాన్స్‌పరెంట్ అడ్వైజరీ సేవలు ఉంటే తాము కూడా ఇన్వెస్ట్ చేస్తామని వారు చెబుతున్నారు. భవిష్యత్తులో మహిళలు కేవలం గృహ అవసరాలకే కాకుండా.. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక భాగస్వాములుగా మారడానికి మ్యూచువల్ ఫండ్స్ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతున్నాయని చెప్పుకోవచ్చు.

# గల్ఫ్ దేశాల్లో ఏయే దేశంలో ఎంతమంది భారతీయులు ఉన్నారంటే..!




పశ్చిమాసియాను యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ గల్ఫ్ దేశాల్లోని భారతీయుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ప్రతీకార దాడులతో గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయా దేశాల్లోని భారత రాయబార కేంద్రాలు అక్కడున్న భారతీయులను అప్రమత్తం చేస్తూ అడ్వైజరీ జారీ చేశాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఢిల్లీలో ఓ హెల్ప్ లైన్ కేంద్రాన్ని ప్రారంభించింది. వైమానికి దాడుల కారణంగా విమానాలు రద్దు కావడంతో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని భారత్ కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లో భారతీయుల సంఖ్య ఎలా ఉందంటే..

యూఏఈ 43.26 లక్షలు, కువైట్ 10.36 లక్షలు, బహ్రెయిన్ 3.1 లక్షలు, సౌదీ అరేబియా 27.47, ఖతార్ 8.30, ఒమన్ 6.76 లక్షలు, ఇరాక్ 17,100, ఇరాన్ 10,765 లెబనాన్ 3,040, ఇజ్రాయెల్ 10,500, జోర్డాన్ 17,050.మొత్తంగా గల్ఫ్ దేశాల్లో దాదాపు 90 లక్షల నుంచి కోటి మంది వరకు భారతీయులు ఉన్నారని కేంద్ర విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# యుద్ధంలోనూ మంగళవారం మళ్లీ తగ్గిన గోల్డ్ రేట్లు.. స్థిరంగా వెండి ధరలు..



అంతర్జాతీయంగా ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధంతో ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ బంగారం రేట్లు రిటైల్ మార్కెట్లో తగ్గటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. వాస్తవానికి గోల్డ్ అండ్ సిల్వర్ రేట్ల ర్యాలీ భారీగా ఉంటుందని అందరూ ఊహించినప్పటికీ వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ క్రమంలో షాపింగ్ చేయాలని అనుకుంటున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ నగరాల్లోని తాజా రేట్లను గమనించి నిర్ణయం తీసుకోవటం బెటర్. మార్చి 3న బంగారం రేట్లు భారీగా తగ్గి ఊరటను కలిగిస్తున్నాయి. దీంతో మార్చి 2 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.49 తగ్గింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.17వేల 002గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.15వేల 585గా తెలుగు రాష్ట్రాల్లోని నగరాల్లో కొనసాగుతోంది.

ఇక వెండి విషయానికి వస్తే మార్చి 3, 2026న రేటు కేజీకి రూ.20వేలు తగ్గింది దేశవ్యాప్తంగా. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు రూ.3లక్షల 15వేల వద్ద ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగుతోంది. అంటే గ్రాము ధర రూ.315 వద్ద ఉంది.

# LNG మార్కెట్‌లో యుద్ధ సెగ: ఆకాశాన్నంటుతున్న షిప్పింగ్ రెంట్స్.. రేట్లు పెరుగుతాయా?

గల్ఫ్ తీరంలో ఒక్కసారిగా యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రాంతీయంగా విస్తరించడం, ప్రపంచంలోనే అతిపెద్ద LNG(లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఖతార్ తన ఉత్పత్తిని నిలిపివేయడం పెను సంచలనం సృష్టించింది. కేవలం 24 గంటల్లోనే అట్లాంటిక్ బేసిన్‌లో ఎల్ఎన్జీ ట్యాంకర్ల అద్దె ధరలు ఆకాశాన్ని తాకాయి. షిప్ యజమానులు, బ్రోకర్లు ఒక్కో నౌకకు రోజుకు 2లక్షల డాలర్ల కంటే ఎక్కువ డిమాండ్ చేస్తుండటంతో షిప్పింగ్ రంగం ఆశ్చర్యపోతోంది.మునుపటి రోజు ధరలతో పోలిస్తే ఇది దాదాపు డబుల్. సోమవారం ఉదయం నాటికి స్పార్క్ కమోడిటీస్ అనే షిప్పింగ్ సంస్థ అంచనా వేసిన ధర 61వేల 500 డాలర్లుగా ఉంది. కానీ ప్రస్తుత ఆఫర్ ధరలు ఆ అంచనా కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ భారీ ధరలకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ఒప్పందాలు జరగలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికి ఇది కేవలం డిమాండ్ స్థాయిలోనే ఉందని, క్షేత్రస్థాయిలో లావాదేవీలు ఇంకా కొలిక్కి రాలేదని వ్యక్తులు గోప్యంగా వెల్లడించారు.ఈ హఠాత్ పరిణామం వెనుక భౌగోళిక రాజకీయ కారణాలు బలంగా ఉన్నాయి. ఖతార్, అబుదాబి వంటి ప్రాంతాల్లో ఉత్పత్తి తగ్గింపు దీర్ఘకాలం కొనసాగితే తప్ప, వాస్తవ లావాదేవీల రేట్లు స్థిరంగా ఇంత భారీ స్థాయిలో ఉండకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రెసిషన్ ఎల్ఎన్జీ కన్సల్టింగ్ నిపుణుడు రిచర్డ్ ప్రాట్ అభిప్రాయం ప్రకారం.. అమెరికా నుండి ఆసియా దేశాలకు గ్యాస్ తరలించాలంటే నౌకలు ప్రయాణించాల్సిన దూరం కూడా పెరుగుతుంది. ఈ అదనపు ప్రయాణ భారం కూడా అద్దె రేట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.మొత్తానికి మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసును దెబ్బతీస్తోంది. ఒకవేళ యుద్ధ పరిస్థితులు సద్దుమణగకపోతే, ఇంధన రవాణా ఖర్చులు పెరిగి అది చివరకు వినియోగదారులపై భారంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మార్కెట్ మొత్తం ఈ ఉద్రిక్తతలు ఎటువైపు దారితీస్తాయోనని గమనిస్తోంది.

# పిల్లలు అతిగా ఫోన్ చూస్తున్నారా?



పిల్లల్లో అధిక మొబైల్ వాడకం వ్యసనంగా మారి, వారి శారీరక, మానసిక ఆరోగ్యం, చదువులు, దినచర్యలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 'టెక్స్ట్ నెక్', కళ్ల అలసట, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది ఫోన్ చేతికి ఆరో వేలిగా మారిపోయింది. పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా ఫోన్‌ను విపరీతంగా వాడుతున్నారు. ఈ అతి వాడకం పెద్దల కంటే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శారీరకంగా మానసికంగా వారిని ఇబ్బందికి గురి చేస్తుంది. మీ పిల్లలు కూడా అతిగా ఫోన్ చూస్తుంటే వారిని వెంటనే ఆ అలవాటు నుంచి దూరం చేయడం ఎలాగో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. పిల్లలో ఫోన్ చూసే అలవాటు క్రమంగా ఒక వ్యసనంగా మారుతుంది. పిల్లల దినచర్య, చదువు, ఆటలు, సామాజిక కార్యకలాపాలపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఫోన్‌లను అధికంగా ఉపయోగించడం వల్ల పిల్లల శ్రద్ధ, నిద్ర, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో ఈ అలవాటును ఎలా నియంత్రించాలో, పిల్లలను సమతుల్య, ఆరోగ్యకరమైన దినచర్య వైపు ఎలా ప్రేరేపించాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ స్క్రీన్‌పై నిరంతరం వేలాడుతూ ఉండటం వల్ల 'టెక్స్ట్ నెక్' వంటి సమస్యలు వస్తాయి, ఇది మెడ, భుజాలు, వెన్నెముకపై చాలా ఒత్తిడిని కలిగిస్తుంది. మొబైల్ ఫోన్‌ల నుండి వెలువడే నీలి కాంతి కళ్ళను అలసటకు గురి చేస్తుంది, వాటిని పొడిగా చేస్తుంది, దృష్టిని బలహీనపరుస్తుంది. రాత్రి ఆలస్యంగా మొబైల్ ఫోన్‌లను వాడటం వల్ల నిద్రలేమి, అలసట మరియు చిరాకు పెరిగే నిద్ర హార్మోన్ 'మెలటోనిన్' ఉత్పత్తి తగ్గుతుంది. గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది, ఇది ఊబకాయం మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొబైల్ వ్యసనాన్ని అధిగమించాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ పిల్లలతో మాట్లాడటం ఉత్తమ మార్గం అని నిపుణులు అంటున్నారు. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల వారి ఆరోగ్యం, చదువులు, మానసిక అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందని పిల్లలకు వివరించడం అవసరం. సమయ పరిమితులను నిర్ణయించడం, మొబైల్ ఫోన్‌ల కోసం ప్రత్యేక సమయాన్ని నిర్ణయించడం, పిల్లలను ఇతర ఆసక్తికరమైన కార్యకలాపాల వైపు ఆకర్షించడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆటలు, విహారయాత్రలు, చదువులు, కుటుంబంతో కలిసి చేసే అభిరుచులు మొబైల్ ఫోన్‌ల నుండి దృష్టి మరల్చడానికి సహాయపడతాయి. పిల్లలు మంచి ఉదాహరణను చూడగలిగేలా తల్లిదండ్రులు కూడా మొబైల్ ఫోన్‌ల వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమంగా పిల్లలను కొద్దిసేపు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించడం అలవాటు చేసుకోండి.

# వీరికి ద్రాక్ష విషంతో సమానం..



ఉతీజీజూవబ రాతిటవ ఇటటవఞబిబ: ఏదైనా పండు లేదా ఆహారం, రోజూ మితంగా తింటే మంచిది.. అలాంటి దినచర్య అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది.. అయితే.. అవకాశం దొరికినప్పుడల్లా దానిని ఎక్కువగా తింటే, మీరు దానిని అనుభవించాల్సిందే అంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఈ వ్యాధులు, సమస్యలు ఉన్నవారు ద్రాక్షకు దూరంగా ఉండాలని.. లేకపోతే సమస్యలు తప్పవని సూచిస్తున్నారు. ద్రాక్ష అనేది అందరూ ఇష్టపడే పండు.. తీపి, పులుపు కలగలిపి జ్యూసీగా ఈ చిన్న పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. బ్లాక్, గ్రీన్ ద్రాక్షాలు ఏవైనా.. తినడం ఆరోగ్యానికి చాలా మంచిది.. ఇందులో విటమిన్లు, బీటా కెరోటిన్, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. ఇది గుండె ఆరోగ్యానికి సహాయపడుతుందని.. అందుకే ప్రతి ఒక్కరూ తినాలని డైటీషియన్లు సూచిస్తున్నారు. సాధారణంగా.. మార్కెట్లో ద్రాక్షను చూసినప్పుడల్లా, ఎంత ఖర్చవుతుందని మనం వెంటనే అడుగుతాము. ద్రాక్షకు అంత ఆహ్లాదకరమైన రుచి ఉంటుంది. ద్రాక్ష ఆరోగ్యానికి ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో.. అంతే ప్రమాదకరమైనది కూడా కావచ్చు. ఈ వ్యాధులు సమస్యలతో బాధపడేవారు ద్రాక్ష తినకూడదని పేర్కొంటున్నారు. ద్రాక్షలో అధిక స్థాయిలో చక్కెర ఉంటుంది.. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు హానికరం. అందువల్ల, వారు ద్రాక్షను పెద్ద పరిమాణంలో తినకూడదు. మీరు మధుమేహ వ్యాధిగ్రస్తులు,

మీ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించాలనుకుంటే, ద్రాక్షను నివారించడం మంచిది.ద్రాక్షలో కరగని ఫైబర్ ఉంటుంది. వీటిని ఎక్కువగా తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వస్తాయి. వాటిలోని చక్కెర కంటెంట్ విరేచనాలకు కారణమవుతుంది. వాటిలోని ఫైబర్ కడుపులో కరగదు కాబట్టి, జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ద్రాక్షకు దూరంగా ఉండాలి. నల్ల ద్రాక్ష రసం తాగడం వల్ల శరీరంలో పొటాషియం శాతం పెరుగుతుంది. ఇది మూత్రపిండాల సమస్యలు లేదా హైపర్‌కలేమియా ఉన్నవారికి హానికరం. ద్రాక్షలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి.. కాబట్టి ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ద్రాక్షకు దూరంగా ఉండాలి. మీరు వాటిని తినాలని భావిస్తే, మీరు వైద్యుడి సలహా తీసుకోవచ్చు. వాటిని ఎక్కువగా తినడం కంటే మితంగా తినడం మీ ఆరోగ్యానికి మంచిది.

# జీడిపప్పు ఎక్కువ తింటే ప్రమాదమా?



ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన జీడిపప్పును మన ఆహారంలో తరచూ తీసుకుంటూ ఉంటాం. అయితే, జీడిపప్పును ఎక్కువగా తీసుకోవడం పలు సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు జీడిపప్పును ఎక్కువగా తీసుకోకపోవడం మంచిందని అంటున్నారు. జీడిపప్పును మితంగా తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదంటున్నారు. జీడిపప్పు, బాదం, పిస్తా, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతుంటారు. డ్రైఫ్రూట్స్ రుచికరంగా ఉండటంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ కారణంగానే వీటి ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ సంపన్నుల నుంచి సామాన్య ప్రజల వరకు వీటిని తమ ఆహారంలో తీసుకుంటున్నారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జీడిపప్పును చాలా మంది తమ వంటకాల్లో వినియోగిస్తుంటారు. పాయసం తోపాటు వెజ్, నాన్ వెజ్ పులావ్, బిర్యానీ, స్వీట్లు, బిస్కెట్లు, కేకులు, టాపింగ్ ఐస్‌క్రీమ్స్ లాంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. కొందరు జీడిపప్పును మాసాల పొడి లేదా కారం లేదా మిరియాల పొడితో నెయ్యిలో వేయించి సేవిస్తారు. ఇలా చాలా రకాలుగా జీడిపప్పును తమ ఆహార పదార్థాల్లో తీసుకుంటూ వాటి ప్రయోజనాన్ని శరీరానికి అందిస్తుంటారు. జీడిపప్పు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతారు. అంతేగాక, శరీర జీవక్రియను పెంచుతాయి. జీడిపప్పులో మోనోఅన్సాచురేటెడ్, పాలీఅన్సాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. వీటితో గుండె ఆరోగ్యానికి ప్రయోజనమే ఉన్నప్పటికీ.. హృదయ సంబంధిత వ్యాధులు ఉన్నవారు మాత్రం జీడిపప్పును ఎక్కువగా తీసుకోకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పలు ఆరోగ్య సమస్యలు కారణమవుతుందని చెబుతున్నారు. జీడిపప్పు ఆరోగ్యకరమైనది అయినప్పటికీ మితంగా తింటేనే మంచిదని అంటున్నారు. జీడిపప్పును తక్కువ మొత్తంలో తరచూ తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యానికి ఎంతో మేలు అని చెబుతున్నారు. కాగా, ప్రతీ సంవత్సరం నవంబర్ 23న జీడిపప్పు దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ ఆచారం మొదట అమెరికాలో ప్రారంభమైంది. జీడిపప్పు చెట్టు ఈశాన్య బ్రెజిల్‌లో పుట్టిందని చెబుతుంటారు. జీడి పప్పు రైతులను గౌరవించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతారు. సాధారణంగా జీడిపప్పు చెట్టు జీవితకాలం 60 ఏళ్లు. జీడిపప్పు నాటిన మూడేళ్లలోపు దిగుబడిని ఇవ్వడం ప్రారంభిస్తుంది. గరిష్ట పంటకు ఎనిమిదేళ్లు పట్టవచ్చు.

## అల్లంతో ఆరోగ్య ప్రయోజనాలు



శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే ఎంతో మంచిది.శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే మంచిది. అల్లంను టీలో మాత్రమే కాకుండా ఇతర ఆహార పదార్థాలకు కూడా జోడించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. అల్లం శీతాకాలంలో వచ్చే జీర్ణ సమస్యల నుంచి మనల్ని కాపాడుతుంది. వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. అంతేగాక, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అందుకే మధుమేహ వ్యాధి బాధితులకు ఇదొక వరమనే చెప్పాలి. అయితే, డయాబెటిస్ ఉన్న వ్యక్తులు అల్లంను మితంగా తీసుకోవాలి. రోజుకు 5 గ్రాములు తీసుకుంటే చాలు. రక్తంలో చక్కరను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. ఇక అల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ లక్షణాలు పుష్కలంగా ఉండటంతో మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శీతాకాలంలో వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. వృద్ధులు తగినంత అల్లం తీసుకోవడం వారి ఆరోగ్యానికి మంచిది. శరీర నొప్పులు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి వృద్ధులకు ఉపశమనం కలిగిస్తుంది. అల్లం కలిపిన మిశ్రమాలు తీసుకోవడం వల్ల శరీరం శక్తివంతం అవుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది.

## రైస్ ఇలా వండితే..

## అన్నం తిన్నా షుగర్ కంట్రోల్!



డయాబెటీస్ ఉన్న వారు, అధిక బరువు ఉన్నవారు అన్నం తినాలంటేనే భయపడిపోతుంటారు. ఎందుకంటే అన్నంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనిని తినడం వల్ల బాడీలో కార్బోహైడ్రేట్స్ పెరిగి బరువుతో పాటు షుగర్ లెవల్స్ కూడా పెరుగుతాయని వాళ్ల టెన్షన్.. అయితే అలాంటి వారికే ఈ గుడ్‌న్యూస్.. అన్నం తిన్నా మీ బాడిలో షుగర్‌ను కంట్రోల్ ఉంచుకోవచ్చు. అన్నం తినడం వల్ల శరీరంలో కార్బోహైడ్రెడ్స్ పెరుగుతాయన్న మాట వాస్తవమే.. కానీ కొన్ని చిట్కాలను పాటించడం వల్ల వాటి పెరుగుదలను నెమ్మది చేయవచ్చు. దానితో పాటు మీ బాడిలో షుగర్‌తో పాటు బరువు పెరగడాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఇందుకు మీరు పెద్దగా కష్టపడాల్ని అవసరం కూడా లేదు. కేవలం అన్నం వండేటప్పుడు అందులో కొన్ని బెండకాయలు, లేదా బంగాళాదుంపలు వేసుకుంటే సరిపోతుంది. దీని వల్ల అన్నం త్వరగా అవ్వడమే కాకుండా ఔషధంలా మారుతుంది. ఇది మేము చెబుతున్న విషయం కాదు.. వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ జాకోబ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఇలా అన్నంలో బెండకాయలు కలిపి వండుకొని తినడం ద్వారా మన బాడిలో షుగర్ లెవల్స్ పెరగకుండా కంట్రోల్‌లోనే ఉంటాయట.

# నిద్రలేచిన వెంటనే నిస్సత్తువగా అనిపిస్తుందా?

ఓట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఓట్స్ తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు నయమవుతాయి. ముఖ్యంగా కాస్త అలసటగా, నీరసంగా అనిపిస్తే వెంటనే ఓట్స్ తయారు చేసుకుని తినడం మంచిది. రాత్రి బాగా నిద్రపోయిన తర్వాత కూడా కొంత మందికి ఉదయం లేచినప్పుడు ఉత్సాహంగా అనిపించదు. నీరసంగా, అలసటగా అనిపిస్తుంది. ఇలా జరగడానికి పోషకాల లోపమని నిపుణులు అంటున్నారు. తరచూ ఇలా అలసిపోయినట్లు అనిపిస్తే ఏం చేయాలని అనిపించదు. అలాంటి సమయాల్లో చాలా మంది నిద్రపోతుంటారు. అయితే ఇలా చేయకుండా కొంచెం ఓపిక చేసుకుని శరీరానికి శక్తినిచ్చే ఆహారాలను తీసుకోవడం మంచిది. ఎందుకంటే నిద్రపోవడం వల్ల బలహీనత మరింత పెరుగుతుంది. ఇలాంటి సందర్భంలో మీరు ఓట్స్ తినవచ్చు. ఓట్స్ అలసట నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. ఎందుకంటే వాటిలో సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి.ఇవి శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి మరియు శరీరాన్ని ఎక్కువ కాలం చురుగ్గా ఉంచుతాయి. ఓట్స్‌లో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఓట్స్ తినడం వల్ల రక్తహీనత నుంచి బయటపడవచ్చు. ఓట్స్‌లో ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి ఉంటాయి. ఇవి కండరాలు, నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. తద్వారా మానసిక, శారీరక అలసట తగ్గుతుంది. ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

## శాఖాహారం అధికంగా తీసుకునే దేశం

ప్రపంచంలోనే అత్యధిక శాకాహార జనాభా కలిగిన దేశంగా భారత్ గతేడాదే రికార్డు బద్దలు కొట్టింది. మనదేశంలో రకరకాల మతపరమైన, సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యతల కారణంగా ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే చాలా రెట్లు ఎక్కువగా శాఖాహారుల నిష్పత్తి ఉందని తాజా నివేదికలు వెల్లడించాయి.. భారత్ జనాభాలో దాదాపు 38% నుండి 42% మంది శాఖాహారులు ఉన్నారు. జైన మతం, హిందూ మతం, బౌద్ధమతంలోని అహింస సూత్రాల కారణంగా భారతదేశం శాఖాహారంలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. దీంతో మన దేశం అత్యధిక శాతం శాఖాహారాన్ని కలిగి ఉన్న దేశాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో మెక్సికో ఉంది. మెక్సికోలో దాదాపు 19% మంది జనాభా శాఖాహారులు. ఇటీవలి సంవత్సరాలలో ఆరోగ్యం,జంతు హక్కుల గురించి పెరిగిన అవగాహన కారణంగా శాఖాహారం వైపు ఈ దేశం మొగ్గు చూపుతోంది. మాంసాహార అలవాట్లకు ప్రసిద్ధి చెందిన బ్రెజిల్ కూడా మారుతోంది. ఇప్పుడు అక్కడ జనాభాలో దాదాపు 14% మంది శాఖాహారులు ఉన్నారు. ఈ ధోరణి ముఖ్యంగా పెద్ద నగరాల్లో కనిపిస్తుంది. ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు 13% మంది శాఖాహారులు ఉన్నారు. 'కోషర్' ఆహార చట్టాలు, 'శాకాహారి' ఉద్యమం ఇక్కడ చాలా ప్రభావవంతమైనవి. టెల్ అవీవ్ నగరాన్ని ప్రపంచంలోని 'శాకాహారి రాజధాని' అని కూడా పిలుస్తారు.

## సంజూను చూసిన తర్వాత 'ఛేజింగ్ మాస్టర్' అనిపించాడు: పాక్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ

- వెస్టిండీస్‌పై సంజు శాంసన్ ఇన్నింగ్స్‌పై ప్రశంసలు
- పాక్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ ఆసక్తికర వ్యాఖ్యలు
- సంజు బ్యాటింగ్‌లో తనకు విరాట్ కోహ్లీ కనిపించాడన్న బసిత్
- అతడు మరో 'ఛేజింగ్ మాస్టర్' అంటూ కితాబు
- స్పష్టమైన ప్రణాళికతో గేర్లు మార్చుతూ ఆడాడని విశ్లేషణ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌పై అద్భుతమైన అజేయ ఇన్నింగ్స్‌తో టీమిండియాను గెలిపించిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత మాజీ ఆటగాళ్లతో పాటు, పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు కూడా అతడి ఆటతీరుకు ముగ్ధులవుతున్నారు. తాజాగా పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ, సంజు బ్యాటింగ్‌ను ఆకాశానికెత్తారు. సంజు ఆడుతున్నప్పుడు తనకు విరాట్ కోహ్లీ కనిపించాడని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బసిత్ అలీ మాట్లాడుతూ.. సంజు బ్యాటింగ్‌ను నిశితంగా గమనిస్తే విరాట్ కోహ్లీ ఆటతీరు స్పష్టంగా కనిపించిందన్నారు. పేస్, స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొని పరుగులు రాబట్టాడని పేర్కొన్నారు. చాలా స్పష్టమైన ప్రణాళికతో బరిలోకి దిగి, పవర్‌ప్లేలో దూకుడుగా ఆడి, ఆ తర్వాత పరిస్థితికి తగ్గట్టు తన ఆటను మార్చుకున్న తీరు అద్భుతమని విశ్లేషించారు. ఈ ఇన్నింగ్స్ చూసిన తర్వాత సంజును 'ఛేజింగ్ మాస్టర్' అనొచ్చని, సాధారణంగా ఈ మాటను విరాట్ కోహ్లీ కోసం వాడతాము కానీ ఈ మ్యాచ్‌లో సంజు ఆడిన విధానం ఆ బిరుదుకు న్యాయం చేసిందన్నారు. ఎవరి బౌలింగ్‌ను లక్ష్యంగా చేసుకోవాలి, ఎప్పుడు గేర్లు మార్చాలి, బంతిని ఏ ప్రదేశానికి పంపాలి అనే విషయాల్లో అతడికి పూర్తి స్పష్టత ఉందని, దాని ప్రకారం తన ప్రణాళికను అమలు చేశాడని బసిత్ అలీ కొనియాడారు.

# ఐసీసీ సెమీస్ ప్యానెల్‌లో ఇద్దరు భారతీయులు.. భారత్-ఇంగ్లండ్ కీలక పోరుకు అంపైర్లు వీరే!

- టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్స్‌కు అంపైర్లను ప్రకటించిన ఐసీసీ
- భారత్-ఇంగ్లండ్ మ్యాచ్‌కు గఫానీ, పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లు
- దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ మ్యాచ్‌కు నితిన్ మెనన్ థర్డ్ అంపైర్
- మ్యాచ్ రిఫరీగా మరో భారతీయుడు జవగళ్ శ్రీనాథ్‌కు బాధ్యతలు
- గత సెమీస్‌లో భారత్ గెలిచినప్పుడు గఫానీ అంపైరింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంది. రేపు, ఎల్లుండి జరగనున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌ల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అఫీషియల్స్ జాబితాను విడుదల చేసింది. ఈ ఎలైట్ ప్యానెల్‌లో భారత అంపైర్ నితిన్ మెనన్‌తో పాటు మాజీ క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్‌కు చోటు దక్కింది. ఈ నెల 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ఇంగ్లండ్ మధ్య జరగనున్న రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌కు క్రిస్ గఫానీ, అల్లావుద్దీన్ పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ థర్డ్ అంపైర్‌గా, పాల్ రీఫిల్ ఫోర్త్ అంపైర్‌గా, ఆండీ పైక్రాఫ్ట్ మ్యాచ్ రిఫరీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. 2024లో ఇదే జట్ల మధ్య జరిగిన సెమీస్‌కు గఫానీ అంపైర్‌గా ఉన్నారు. ఆ మ్యాచ్‌లో భారత్ 68 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలోనూ గఫానీ భారత్ ఆడిన రెండు మ్యాచ్‌లకు, పాలేకర్ ఒక మ్యాచ్‌కు అంపైరింగ్ చేశారు.

ఇక, రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీ ఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా ఉంటారు. ఈ మ్యాచ్‌లో భారత అంపైర్ నితిన్ మెనన్ థర్డ్ అంపైర్‌గా కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. రాడ్ టక్కర్ ఫోర్త్ అంపైర్‌గా, మరో భారతీయుడైన జవగళ్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు. రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా సెమీ ఫైనల్‌లో గెలిచిన మ్యాచ్‌కు ఇల్లింగ్‌వర్త్ అంపైర్‌గా వ్యవహరించగా, ఈ టోర్నీ గ్రూప్ స్టేజ్‌లో న్యూజిలాండ్ ఆడిన మ్యాచ్‌కు వార్ఫ్ అంపైరింగ్ చేశారు. దీంతో అత్యంత కీలకమైన సెమీస్ పోరులకు అనుభవజ్ఞులైన అఫీషియల్స్‌నే ఐసీసీ నియమించినట్లయింది.

## ఇండియా చేరుకున్న పీవీ సింధు.. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కు దూరం..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా దుబాయ్ ఎయిర్పోర్టులో చిక్కుకున్న ఇండియన్ స్టార్ బ్యాట్మింటన్ ప్లేయర్ పీవీ సింధు స్వదేశానికి చేరుకున్నారు. యుద్ధం కారణంగా దుబాయ్ ఎయిర్పోర్టు మూసివేయడంతో శనివారం నుంచి దుబాయ్ లోనే ఉండిపోయారు సింధు మంగళవారం ( మార్చి 3 ) ఉదయం దుబాయ్ నుంచి బెంగుళూరుకు చేరుకున్నారు. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కోసం బర్మింగ్ హామ్ బయలుదేరిన సింధు యుద్ధం కారణంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. దీంతో ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కు దూరమయ్యింది. ఈ క్రమంలో ఇంటికి సురక్షితంగా చేరుకున్నానంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పీవీ సింధు. ప్రస్తుతానికి రెస్ట్ తీసుకొని ఆ తర్వాత భవిష్యత్ ప్రణాళికపై దృష్టి పెడతానంటూ ట్వీట్ చేశారు పీవీ సింధు. జరిగే ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ లో సింధు పాల్గొనడం లేదని ప్రకటించింది బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా. ఈ టోర్నీ కోసం మిగతా షట్లర్లు సింగపూర్, ఆఫ్రికా మీదుగా ప్రయాణించి బర్మింగ్ హామ్ కు చేరుకున్నారు. మెన్స్ షట్లర్లు లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి ఎలాంటి ప్రయాణ సమస్యలు లేకుండా ఇంగ్లండ్ కు చేరారు. మెగా టోర్నీలో లక్ష్యసేన్, డబుల్స్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిపై ఇండియా అంచనాలు పెట్టుకుంది. అయితే లక్ష్య సేన్ కు తొలి రౌండ్లోనే వరల్డ్ నంబర్ వన్ షి యుకీ (చైనా) రూపంలో కఠిన సవాల్ ఎదురవనుంది. ఆయుష్.. అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో తలపడనున్నాడు.

# చీరకట్టులో గ్లామర్ డోస్ పెంచేసిన ప్రభాస్ బ్యూటీ!


బాలీవుడ్ సెన్సేషన్, నేషనల్ క్రష్ త్రిప్తి డిమ్రి తన అందచందాలతో మరోసారి ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇవి పాత జ్ఞాపకాలుగా మారకముందే అప్‌లోడ్ చేస్తున్నాను అంటూ షేర్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది ఈ భామ. 'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

**త్రిప్తి సక్సెస్ జర్నీ:**

త్రిప్తి డిమ్రి సినీ ప్రయాణం 2017లో 'పోస్టర్ బాయ్' చిత్రంతో మొదలైంది. ఆ తర్వాత వచ్చిన రొమాంటిక్ డ్రామా 'లైలా మజ్ను'లో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కేవలం అందానికే పరిమితం కాకుండా, ప్రతిభావంతురాలైన నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇక 2021లో ఫోర్బ్స్ ఆసియా '30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించుకోవడం ఆమె కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయి. ఇక కష్టపడి పైకి వచ్చిన త్రిప్తి, ఇప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె ఎంపిక చేసుకునే కథలు, నటనలోని వైవిధ్యం ఫాన్స్ ను అలరిస్తున్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను పలకరించడం త్రిప్తి మర్చిపోదు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన చీరకట్టు ఫో టోలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. ఫ్యాషన్ డ్రెస్ లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, చీరలో అంతటి హోయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇక ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు స్టన్నింగ్ బ్యూటీ అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. పాత జ్ఞాపకాలుగా మారకముందే తన అందాలను ఫ్యాన్స్‌కు షేర్ చేసి, మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది ఈ స్పిరిట్ బ్యూటీ.



అనుక్రీతి వాస్ సోషల్ మీడియాను తగలబెట్టింది



**ప్రభాస్ 'స్పిరిట్'లో త్రిప్తి:**

రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా సినిమాలంటేనే హీరో-హీరోయిన్ల మధ్య ఘాటు రొమాన్స్, బోల్డ్ సీన్స్ మరియు ఇంటెన్స్ లిప్ కిస్సులు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక 'యానిమల్'లో తన గ్లామర్‌తో కుర్రాళ్ల గుండెల్లో సెగలు పుట్టించిన త్రిప్తి, ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేయబోతుందోనని ఫ్యాన్స్ అప్పుడే లెక్కలు వేస్తూ మూవీ కోసం ఎదురుచూస్తున్నారు.



సోనమ్ బజ్వా ఫ్లోరల్ కార్సెట్ గౌన్‌లో సొగసును ప్రసరిస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965